
ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శనివారం అక్టోబరు 26, 2024



ఎస్సీ బాలుర వసతిగృహం గదిలో పెచ్చులూడిన ఫ్లోరింగ్



గంగిరెద్దుల దిబ్బ బాలుర బీసీ వసతి గృహానికి అందజేసిన మంచాలు బిగించకపోవడంతో కిందే పడుకున్న విద్యార్థులు



బాలుర బీసీ వసతి గృహంలో ఊడిపోయిన కిటికీ తలుపులు

కష్టాలే వసతి.. కన్నీళ్లే గతి



ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో ఫ్యాను రెక్కలు వంగి..

- చలికాలం దుప్పట్లు లేక పిల్లల అవస్థలు
- సమస్యల వలయాల్లో వసతి గృహాలు
- వెంటాడుతున్న వైకాపా సర్కారు పాపాలు
- కూటమి ప్రభుత్వం చక్కదిద్దితేనే సంక్షేమం


కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో సంక్షేమ వసతిగృహాలు నరకానికి నకళ్లుగా తయారయ్యాయి. ఇందులో విద్యార్థులు కనీస వసతుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఇవి ఆనవాళ్లుగా నిలుస్తున్నాయి. తాను విద్యార్థులకు మేనమామను అని కబుర్లతో కాలక్షేపం చేశారు నాటి ముఖ్యమంత్రి జగన్. అప్పటి పాలకుల పాపఫలితం విద్యార్థులకు శాపంగా మారింది. నాడు - నేడు పథకం ద్వారా రూపురేఖలు మారుస్తామని ప్రగల్భాలు పలికారు తప్ప.. ఏమాత్రం పట్టించుకున్న పాపానపోలేదు. క్షేత్రంలో పరిస్థితులను పరిశీలిస్తే సంక్షేమం సిగ్గుపడే స్థాయికి దిగజార్చారు. బటన్ నొక్కుడు.. అందినకాడికి మెక్కుడు తప్ప చేసిందేమీ లేదు. చలికాలం సమీపిస్తున్న వేళ విద్యార్థుల కష్టాలు చెప్పనలవి కాకుండా ఉన్నాయి. కప్పుకొందామంటే దుప్పట్లు లేవు.. కిటికీలకు తలుపులు లేక సగం రాత్రయ్యేసరికి గజగజ వణుకుతున్నారు. దీనికి తోడు రాత్రివేళ ఎటు నుంచి విషపురుగులు, పాములు వచ్చి కరుస్తాయో అనే భయంతో నిద్రిస్తున్నారు. పైకప్పు పెచ్చులు ఏ క్షణం ఊడిపడతాయో తెలియకుంది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి సరైన మరుగుదొడ్లు కూడా లేని దైన్యం. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో కంటి నిండా నిద్రపోదామన్నా సాధ్యం కాని దుస్థితి. రెండు జిల్లాల్లో వసతిగృహాలలో విద్యార్థులు అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. 'న్యూస్‌టుడే' పరిశీలనలో వెలుగు చూసిన భావితరం వేదన ఇది. ఈ పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు గంపెడాశలు పెట్టుకున్నారు. చలి తీవ్రత పెరగకముందే స్పందించి దుప్పట్లు, కిటికీలకు తలుపులు బిగించాలని, పాడైన వాటిని మరమ్మతులు చేయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

- ఈనాడు డిజిటల్, అమరావతి, న్యూస్‌టుడే, బృందం

ఉమ్మడి కృష్ణా జిల్లాలో వసతి గృహాలు..

	కృష్ణా	ఎన్టీఆర్	విద్యార్థులు
బీసీ	43	27	3782
ఎస్సీ	40	38	3385
ఎస్టీ	01	10	2093

(ఆశ్రమ, రెసిడెన్షియల్, ప్రతిభ కళాశాలలు కలిపి)



ఎస్సీ బాలుర వసతి గృహంలో గదులకు తలుపులు విరిగి చలి, దోమలతో సతమతమవుతున్నారు


బీసీ హాస్టల్‌లో గోడలు బీటలు వారి చెమ్మగిల్లి నాచుపడుతున్న తీరు



ఈడ్పుగల్లులో ఎస్సీ బాలుర వసతి గృహం కిటికీ తలుపులు విరిగి..



బీసీ కళాశాల హాస్టల్లో తలుపుల్లేని స్నానాల గదులు



మొవ్వ ఎస్సీ బాలుర వసతిగృహంలో దుప్పట్లు, చాపలు లేకుండా నేలపైనే పడక..



ప్రభుత్వ బాలుర హాస్టల్‌లో కిటికీల తలుపులు ఇలా..

బ్యారేజీకి వరద ఉద్ధృతి.. 70 గేట్ల ఎత్తివేత

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ వద్ద శుక్రవారం వరద ఉద్ధృతి నెలకొంది. ఉదయం 6 గంటలకు ఎగువ నుంచి 1,59,916 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 1,45,250 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు 2,36,158 క్యూసెక్కులకు పెరిగింది. 30 గేట్లను 5 అడుగులు, మిగతా 40 గేట్లను 4 అడుగులు మేర ఎత్తారు. సముద్రంలోకి 2,20,500 క్యూసెక్కులు, పంట కాల్వలకు 15,658 క్యూసెక్కులు విడుదల చేశారు. రాత్రి 8 గంటలకు ఎగువ నుంచి 2,17,150 క్యూసెక్కులు రాగా, సముద్రంలోకి 2,01,492, కాల్వలకు 15,658 క్యూసెక్కులను విడుదల చేశారు.

కాల్వలకు నీటి విడుదల ఇలా.. ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా డెల్టా పరిధిలోని పంట కాల్వలకు మొత్తం 15,658 క్యూసెక్కులు ఇస్తున్నారు. వీటిలో కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 8,632, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 7,026 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాల్వకు 4,188, ఏలూరు 1,302, కేఈబీ 1,507, బందరు కాల్వలకు 1,705 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు.

★ 'సార్ మరో మూడు నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు..! మమ్మల్ని పనులు చేసుకోనీయండి..! దయచేసి గ్రావెల్‌కు అడ్డుపడకండి..!'

★ 'లేదు.. మేమే తోలతాం..! మీకు సంబంధం లేదు.. లారీలు వెంటనే ఆపేయాల్సిందే..!' నియోజకవర్గానికి చెందిన ఓ నేత తీరు ఇది..!

> వైకాపా జమానాలో ఇష్టానుసారం గ్రావెల్, మట్టి తవ్వకాలు జరిపిన నేతలు.. ప్రభుత్వం మారినా వారి తీరు మారలేదు. మట్టి గ్రావెల్ తామే నిర్వహించాలని పట్టుబడుతున్నారు. అక్రమమైనా.. సక్రమమైనా.. లీజులు ఎవరైనా.. ప్రభుత్వ స్థలమైనా.. పట్టా భూములైనా.. తామే నిర్వహించాలని పట్టుబడుతున్నారు. దీంతో లైసెన్సులు పొందిన వారు సైతం అవాక్కవుతున్నారు. మరోవైపు చోటా నాయకులు.. తమకూ వాటాలు కావాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగైతేనే గ్రావెల్ లారీలను కదలనిస్తామని హెచ్చరిస్తున్నారు.

తవ్వేది.. తోలేది.. మేమే!

- ముఖ్య ప్రజాప్రతినిధి బంధువు అడ్డగోలు
- బైపాస్ పనులకు ఆటంకం సృష్టిస్తున్న నేత
- మైలవరం, గన్నవరంలలో మారని వైఖరి

ఈనాడు - అమరావతి

విజయవాడ బైపాస్ నిర్మాణం శరవేగంగా జరుగుతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ జిల్లాలో మూడో ప్యాకేజీ నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఇంకా పది శాతం పనులు, హైటెన్షన్ తీగల తొలగింపు మిగిలాయి. కృష్ణా నదిపై వంతెన నిర్మాణం చివరిదశకు వచ్చింది. గుంటూరు జిల్లాలో నాలుగో ప్యాకేజీ నిర్మాణం జరుగుతోంది. దీన్ని నవయుగ, అదాని సంస్థ సంయుక్తంగా దక్కించుకున్నాయి. కొంత నత్తనడకన సాగుతున్న బైపాస్ నిర్మాణంపై సీఎం చంద్రబాబు ఇటీవల సమీక్షించారు. రాజధానికి వెళ్లే రహదారుల వద్ద పైవంతెనలు నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. ఈప్యాకేజీ పనులు మరో మూడు నాలుగు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికి పెద్దఎత్తున గ్రావెల్ మట్టి అవసరం. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల నుంచి దీన్ని సేకరిస్తున్నారు. మరోవైపు వీటీపీఎస్ బూడిద వినియోగిస్తున్నారు. ఈరెండింటి సరఫరాకు అడ్డంకులు ఎదురవుతున్నాయి.


తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

మళ్లీ తెరపై వారే..!

గత ప్రభుత్వంలో బైపాస్ నిర్మాణం ప్రముఖ సంస్థలు చేపడుతున్నా.. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల వైకాపా ప్రజాప్రతినిధులు, వారి అనుచరులే బూడిద, గ్రావెల్ సరఫరా చేశారు. అక్రమంగా పెద్దఎత్తున తవ్వారు. కొత్తూరు తాడేపల్లిలో నాటి ఎంపీ ఆధ్వర్యంలో తవ్వకాలు జరిగాయి. జాతీయ రహదారి నిర్మాణ సంస్థ నుంచి భారీగా బిల్లులు తీసుకున్నారు. ప్రస్తుతం అదే తరహా నడుస్తోంది. మైలవరంలో గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఓ ప్రజాప్రతినిధి బంధువు ఇప్పుడు అడ్డుతగులుతున్నారు. మైలవరం మండలం చంద్రాల, ఎదురుబీడుల్లో రెవెన్యూ పోరంబోకు వద్ద 5 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులు లీజుకు తీసుకుని గ్రావెల్‌కు అనుమతి పొందారు. దీనిలో గతంలో ప్రజాప్రతినిధి వద్ద పీఏగా పనిచేసిన ఓ వ్యక్తి ఉన్నారు. మరో ప్రైవేటు వ్యక్తి అసైన్డ్ భూముల్లో తవ్వకాలకు అనుమతి తెచ్చుకున్నారు. వీరు నవయుగ కోసం గ్రావెల్ తరలిస్తుంటే ప్రజాప్రతినిధి బంధువు అడ్డుకున్నారు. తామే సరఫరా చేస్తామని.. ఓ ఎంపీపీతో (వైకాపా) కలిసి అడ్డుతగిలారు. దీనిని ఆ సంస్థ ప్రాజెక్టు మేనేజరు రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిసింది. మైలవరం, గన్నవరం పరిధిలో ఎవరూ తవ్వకాలు జరిపేది లేదనీ.. అంతా తానే చూసుకుంటానని ఆ బంధువు హెచ్చరిస్తున్నారు.


మైలవరం మండలం ఎదురుబీడు వద్ద నిలిపేసిన లారీలు

మాకూ వాటాలు..!

జి.కొండూరు మండలంలోనూ కొంత ప్రైవేటు పట్టా భూమిలో లీజులు ఉన్నాయి. మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. వెలగలేరులో దీన్ని అడ్డుకుంటున్నారు. తమకు అనుమతులు ఉన్నాయని వాదిస్తుంటే.. మాకూ వాటాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే వాహనాలు వెళ్లనీయబోమని హెచ్చరిస్తున్నారు. దీనిపై వెలగలేరులో రెండు వర్గాల మధ్య ఘర్షణ కూడా జరిగింది. దీని వెనుకా ప్రజాప్రతినిధి బంధువే ఉన్నారు. వైకాపా నాయకులే చక్రం తిప్పుతున్నారు. ఆ ప్రజాప్రతినిధి అండ బాగా ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని పంచాయితీలు ఆ బంధువుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. తనకు తెలియనట్లు ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్నారని చెబుతున్నారు.

ఇంద్రకీలాద్రిపై 11 నుంచి భవానీ మండల దీక్షలు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే భవానీ మండల దీక్షలు నవంబరు 11 నుంచి ప్రారంభం అవుతాయి. నవంబరు 11 నుంచి 15 వరకు మండల దీక్షలు, డిసెంబరు 1 నుంచి 5 వరకు అర్ధమండల దీక్షల స్వీకరణ తేదీలుగా నిర్ణయించారు. 14న సత్యనారాయణ పురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు భవానీ దీక్షాధారుల కలశయాత్ర ఆరంభం కానుంది. అక్కడ నుంచి ఏలూరు, బందరు రోడ్డు మీదుగా యాత్ర కనకదుర్గానగర్‌కు చేరుతుంది.

డిసెంబరు 21- 25 వరకు దీక్షల విరమణ.. దుర్గగుడి ఆధ్వర్యంలో డిసెంబరు 21-25 వరకు దీక్షల విరమణ కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఉత్సవాల తరహాలోనే దీక్షల స్వీకరణ, విరమణ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేయాలని నిర్ణయించారు.

ఆర్యవైశ్య అవివాహితులకు సువర్ణావకాశం

నేడు, రేపు ఆర్యవైశ్య కుల వధూవరులకు ఈనాడు పెళ్లిపందిరి ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం



తెలుగింటి వివాహ పరిచయాలకు ఆత్మీయ వేదిక అయిన ఈనాడు పెళ్లిపందిరి, ఆర్యవైశ్య కుల అవివాహిత వధూవరులకు ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. విజయవాడ ఆటోనగర్‌లోని స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, బీ బ్లాక్ మూడవ అంతస్తులోని ఈనాడు ఆఫీస్‌లో నిర్వహిస్తున్నారు. వివాహం కోసం ఎదురుచూస్తున్న వధూవరులతో పాటు సంబంధిత కుటుంబీకులు **నేడు (26 అక్టోబర్ 2024 శనివారం) రేపు (27 అక్టోబర్ 2024 ఆదివారం) ఉదయం 9 గం. నుంచి సాయంత్రం 5.30 గం. వరకు** తమ ప్రొఫైల్‌ను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు.

మరిన్ని వివరాలకు
95501 28306 & 80080 01686 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చు.

★ ఉచిత ప్రొఫైల్ రిజిస్ట్రేషన్ ఫోన్‌లో యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు.
రిజిస్ట్రేషన్ చేయదలచిన వధూవరుల బయోడేటా, ఫోటోలు పైన తెలియజేసిన వాట్సాప్ ఫోన్ నంబర్లకు పంపవచ్చు.

పాడి రైతులకు బాసటగా పశు వైద్యం

క్లస్టర్ల వారీగా కృష్ణా పాల సమితి కార్యాచరణ



పశువైద్య సంచార వాహనాలు

చిట్టినగర్, న్యూస్‌టుడే

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా కృష్ణా పాల సమితి(విజయ డెయిరీ) పని చేస్తోంది. లక్షా యాభై వేల పాడి రైతు కుటుంబాల సంక్షేమం వర్ధిల్లుతోంది. ప్రస్తుతం పలువురు అన్నదాతలు పాడి పరిశ్రమ వైపు అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేలు జాతి పశువులను కొనుగోలు చేసి పాల ఉత్పత్తిలో దూసుకెళ్తున్నారు. పాల దిగుబడికి పశువులే మూలం. అలాంటివి ఆరోగ్యకరంగా ఉండేందుకు, వినియోగదారులకు స్వచ్ఛమైన పాలు అందించేందుకు నిత్యం పశువైద్యుల పర్యవేక్షణ ఉండేలా కృష్ణా మిల్క్ యూనియన్ చర్యలు తీసుకుంది. వాటికి ఎలాంటి సీజనల్ వ్యాధులు రాకుండా ఏ పాల డెయిరీలు అందించలేని విధంగా పశువైద్య సంచార వాహనాలను ఏర్పాటు చేసి వైద్యం ఉచితంగా అందిస్తూ పాడి రైతులకు అండగా నిలుస్తోంది.

క్లస్టర్ల వారీగా వాహనాల ఏర్పాటు

విజయ డెయిరీ యాజమాన్యం పది పశు వైద్య సంచార సేవా వాహనాలను ఏర్పాటు చేసింది. ఒక్కొక్క దానిలో ఇద్దరు పశువైద్యులు, మరో ఇద్దరు సహాయకులు ఉంటారు. ఎన్టీఆర్, కృష్ణా, పశ్చిమ గోదావరి, ప్రకాశం జిల్లాల్లో కొంత భాగం కృష్ణా పాల సమితి కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో గన్నవరం, మైలవరం, తిరువూరు, పామర్రు, చిల్లకల్లు, గుడ్లవల్లేరు, హనుమాన్ జంక్షన్, ముండ్లమూరు(ప్రకాశం జిల్లా), నల్లజర్ల(పశ్చిమ గోదావరి), రంగాపురం(పశ్చిమ గోదావరి) క్లస్టర్లుగా విభజించి వీటిని కేటాయించారు. ఒక్కొక్క క్లస్టర్‌కి సుమారుగా 60 నుంచి 70 గ్రామాలు ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో పశు వైద్య సేవలను ఉచితంగా అందిస్తోంది.

ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా చర్యలు

సాధారణంగా ఎదగని, చూడి నిలవని పశువులు, సాధారణ వ్యాధులు, గేదెలకు జలగ వ్యాధి, సీజనల్‌గా గొంతువాపు(గురక వ్యాధి), గాలి కుంటు వ్యాధి సోకుతోంది. అదే లేగ దూడలకు ఏలిక పాము ప్రబలి ఇబ్బంది పెడతాయి. ఆయా వ్యాధులు సోకినప్పుడు రైతులు పశు వైద్యులను సంప్రదిస్తే సంచార వాహనాల ద్వారా వైద్యం అందిస్తున్నారు. కృష్ణా పాల ఉత్పత్తిదారులకు మాత్రమే టీకాలు, మందులను ఉచితంగా ఇస్తున్నారు. అత్యవసర వైద్యం ఎల్లవేళలా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నారు.

పుట్టిన దూడలపై జాగ్రత్తలు

దూడ పుట్టిన 12 గంటల లోపు వీలైనంత ఎక్కువ మోతాదులో తల్లి దగ్గర జున్ను పాలు తాగించాలి. మట్టి, ఇతర వస్తువులు నాకకుండా మూతికి చిక్కం తగిలించాలి. 10, 40, 70 రోజులకు ఒకసారి ఏలికపాముల మందు వేయించాలి. మూడు నెలల లోపే గడ్డి తినిపించకుండా జాగ్రత్తలు పాటించాలి. దూడ పుట్టిన వెంటనే బొడ్డు వద్ద ఎలాంటి ఇన్‌ఫెక్షన్ రాకుండా పసుపు గానీ, అయోడిన్(టించర్) రాస్తే మంచిది.

అప్రమత్తత అవసరం

గేదెలు ఈనే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వైద్యులు పర్యవేక్షణతో పాటు రైతు అప్రమత్తంగా ఉండాలి. గేదెలు సహజంగా పది నెలల తర్వాత ఈనుతాయి. అనంతరం 12 నుంచి 24 గంటల లోపు మావి పడిపోతుంది. ఒకవేళ మావి పడ పోతే చెయ్యి పెట్టి బయటకు లాగే ప్రయత్నం చేయకూడదు. అలా చేస్తే కొంత భాగం తెగిపోయి లోపలి కుళ్లిపోయే ప్రమాదం ఉంటుంది. తద్వారా గేదె అనారోగ్యానికి గురై తర్వాత వచ్చే చూడి నిలవదు. అందుకే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

-ఎస్.ప్రసాద్‌లింగం, విజయ డెయిరీ వెటర్నరీ కన్సల్‌టెంట్

డీఆర్వోగా లక్ష్మీనరసింహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా రెవెన్యూ శాఖ అధికారిగా ఎం.లక్ష్మీనరసింహం నియమితులయ్యారు. సర్వే శాఖ నుంచి ఆయన్ని జిల్లాకు బదిలీ చేశారు. ప్రస్తుత డీఆర్వో వి.శ్రీనివాసరావును సాధారణ పరిపాలన శాఖలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నగరంలో పశు గణన

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : పశు గణన ప్రక్రియ దేశ వ్యాప్తంగా ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. ప్రస్తుతం 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమానికి జిల్లాలో శుక్రవారం శ్రీకారం చుట్టారు. నగరంలోని జేసీ విడిది కార్యాలయం వద్ద ప్రారంభ కార్యక్రమ సందడి నెలకొంది. ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా, పశు సంవర్ధక శాఖ, గణన అధికారులు పాల్గొన్నారు. మొత్తం 16 రకాల సాధు జంతువులు, పక్షి జాతికి చెందిన కోళ్లు తదితరాలను లెక్కిస్తారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, పోనీస్ గాడిదలు, కంచర గాడిదలు, ఒంటెలు, ఏనుగులు, కుక్కలు, కుందేళ్లు, కోళ్లు, బాతులు, టర్కీ కోళ్లు, ఇతర పెంపుడు జంతువులను లెక్కిస్తారు.

డీఆర్ఎం కార్యాలయంలో విచారణ నేడు

ఈనాడు, విజయవాడ : ఇటీవల విజయవాడ రైల్వే సీనియర్ డీపీవో కట్టా ఆనంద్‌పై ఫిర్యాదు చేసి అదే విభాగానికి చెందిన మహిళా ఉద్యోగి వ్యవహారంపై శనివారం డీఆర్ఎం కార్యాలయంలో విచారణ జరగనుంది. ఉదయం 10 గంటలకు జరిగే విచారణలో సీనియర్ డీసీఎం, రైల్వే ఆస్పత్రి ఏసీఎంఎస్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఓ ఎన్జీవో పాల్గొంటారు. సదరు అధికారిపై మహిళా ఉద్యోగి రైల్వే జీఎంతో పాటు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరిని కలిసి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో రైల్వే ఉన్నతాధికారులు విచారణ కమిటీని నియమించారు. ఈ కమిటీలో రైల్వే కార్మిక సంఘాలకు కూడా చోటు కల్పిస్తే బాగుండేదని ఆ సంఘ నాయకులు పేర్కొన్నారు.

అమరావతి రైల్వేలైన్‌పై రాజధాని రైతుల హర్షం

మిఠాయిల పంపిణీ



కేకు కోస్తున్న మహిళలు, రైతులు

తుళ్లూరు, న్యూస్‌టుడే : ప్రజా రాజధాని అమరావతికి రైల్వే లైను నిర్మాణానికి కేంద్రం పచ్చ జెండా ఊపడంతో రాజధాని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గుంటూరు జిల్లా తుళ్లూరులో మహిళలు, రైతులు కేకులు కోసి మిఠాయిలు పంచారు. జై మోదీ, జై చంద్రబాబు, జై పవన్ కల్యాణ్, జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేయనున్న 57 కిలోమీటర్ల రైలు మార్గంతో దేశంలోని వివిధ ప్రాంతాలకు అనుసంధానం ఏర్పడుతుందన్నారు. నేతలకు ధన్యవాదాలు తెలిపారు.


వరద బాధితులకు రూ.296.82 కోట్ల జమ



ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలో 1,80,098 మంది వరద బాధితులకు శుక్రవారం నాటికి రూ.296.82 కోట్లను నేరుగా డీబీటీ ద్వారా బాధితుల ఖాతాల్లో జమ చేసినట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా ఓ ప్రకటనలో తెలిపారు. 179 గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని ప్రజలు వరద వల్ల ఇబ్బందులు పడ్డారని చెప్పారు. బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగానూ, జవాబుదారీతనంతో నష్ట గణన చేపట్టినట్టు పేర్కొన్నారు. గృహాలు, వాహనాలు, ఎం.ఎస్.ఎం.ఇ., వ్యవసాయం, పశు సంవర్ధక, మత్స్య, చేనేత, ఉద్యాన శాఖల పరిధిలో 1,80,098 మంది బాధితులను గుర్తించి, రూ.296.82 కోట్లు జమ చేసినట్టు వివరించారు. లబ్ధిదారుల జాబితాలను స్థానిక సచివాలయాల్లో ప్రదర్శించినట్టు తెలిపారు. కలెక్టరేట్‌లో స్వీకరించిన దరఖాస్తులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో నమోదు చేసినట్టు పేర్కొన్నారు. ఇలా నమోదు చేసిన 2,954 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన బాధితులను ఆధార్‌తో అనుసంధానించి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్టు వివరించారు. 256 దరఖాస్తులకు సంబంధించి డేటా అందుబాటులో లేని కారణంగా నగదు జమ కాలేదన్నారు. వీటి వివరాలను తీసుకుని సాయం అందిస్తామన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి సాయం అందాలని సీఎం చంద్రబాబు చేసిన మార్గనిర్దేశనంతో జిల్లా అధికార యంత్రాంగం కృషి చేసి, సాయం అందిస్తున్నట్టు ఆమె వివరించారు.

కడలి ఒడికి 800 టీఎంసీలు



ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రస్తుత సీజనులో శుక్రవారం ఉదయం 6 గంటల వరకు (ఇప్పటి వరకు) 798.017 టీఎంసీలు (సుమారు 800 టీఎంసీల) నీరు సముద్రంలో కలిసిపోయాయి. కృష్ణా డెల్టా పరిధిలోని ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని సాగునీటి అవసరాలకు ఇప్పటి వరకు 92 టీఎంసీలను వినియోగించారు. వీటిలో 12.21 టీఎంసీలు పట్టిసీమ ద్వారా గోదావరి జలాలు రాగా, మిగతావి కృష్ణా నది పరివాహక ప్రాంతం నుంచి వచ్చాయి. సెప్టెంబరులో 476 టీఎంసీల పైచిలుకు నీరు కడలి ఒడికి చేరింది. పులిచింతల-ప్రకాశం బ్యారేజీ మధ్య, బ్యారేజీ దిగువున అదనపు ఆనకట్టల నిర్మాణం లేకపోవడంతో సముద్రంలోకి వృథాగా పోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

నెల	టీఎంసీలు
జులై	2.23
ఆగస్టు	215.74
సెప్టెంబరు	476.16
అక్టోబరు	104.04

తిరుపతమ్మ అమ్మవారి దీక్షల తేదీలు ఖరారు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో దీక్షలు స్వీకరించే తేదీలను ఖరారు చేసినట్లు ఆలయ ఈవో కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. మండల దీక్షల మాలాధారణ డిసెంబరు 25 నుంచి 31 వరకు, అర్ధ మండల దీక్షను జనవరి 18 నుంచి 21 వరకు దేవాలయం వద్ద జరుగనుందని చెప్పారు. భక్తుల కోరిక మేరకు ఈ ఏడాది 11 రోజుల దీక్ష చేపట్టినట్లు వెల్లడించారు. అందుకు జనవరి 27 నుంచి 31 వరకు ఆలయం వద్ద దీక్ష తీసుకోవాలని కోరారు.

ట్రూఅప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి : సీపీఎం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విద్యుత్తు ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధి సన్నగిల్లి ఆదాయాలు తగ్గడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలపై విద్యుత్తు భారం మోపడం సరికాదన్నారు. ఎప్పుడో వాడిన విద్యుత్తుకు ఏళ్లు గడిచిన తర్వాత అదనంగా ఛార్జీలు చెల్లించాలనే విధానం మోసపూరితమని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే ఛార్జీలు నియంత్రిస్తామని, బిల్లుల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు అమాంతం 44 శాతం పెంచడం దారుణమన్నారు.

జగన్మాత సేవలో ప్రముఖులు



జస్టిస్ సుమతికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో శ్రీనివాసరావు



మంత్రి నారాయణ, కేంద్ర హుడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్ఠలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జె.సుమతి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో శ్రీనివాసరావు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. మరో సందర్భంలో రాష్ట్ర పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, కేంద్ర హుడ్కో సీఎండీ సంజయ్ కులశ్రేష్ఠలతో కలిసి శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో రామారావు వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. హుడ్కో అధికారులు మూర్తి, నాగరాజ్ పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధిలో జైన్‌ల భాగస్వామ్యం అభినందనీయం



మాట్లాడుతున్న భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, హాజరైన జైన్‌లు

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే వ్యాపార రంగ అభివృద్ధిలో జైన్‌ల పాత్ర కీలకమని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. జైనుల సంఘాలకు చెందిన జీతో (జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) విజయవాడ ఛాప్టర్ ప్రధాన, మహిళ, యువజన విభాగాల నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకారోత్సవాన్ని విజయవాడ ఎంజీ రోడ్డులోని శేషసాయి కల్యాణ వేదికలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నూతన కమిటీ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వ్యాపార అభివృద్ధిలో తోటి వారికి సూచనలు, సలహాలు అందించాలని కోరారు. జీతో ఎపెక్స్ ఛైర్మన్ పృధ్వీరాజ్ కొఠారి, అధ్యక్షుడు విజయభండారీ మాట్లాడుతూ... జైన్‌లు కేవలం వ్యాపారమే కాకుండా సామాజిక సేవా రంగంలోనూ ముందున్నారని తెలిపారు. జీతో విజయవాడ అధ్యక్షుడు కమలేష్ పోలాముత్తా, కార్యదర్శి ప్రవీణ్‌రాంకా మాట్లాడుతూ... సేవ, చదువు, వ్యాపారాభివృద్ధి అంశాల్లో పనిచేస్తామని తెలిపారు. ఉపాధ్యక్షులు దినేష్‌జైన్, రాకేష్‌జైన్, ముఖ్య కార్యదర్శి మనీష్‌జైన్, కార్యదర్శులు ప్రవీణ్ రాంకా, మనీష్‌మంగిలాల్‌జైన్, కోశాధికారి కుందనమల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ స్థలాల పరిరక్షణకు చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని ప్రభుత్వ, కార్పొరేషన్ స్థలాలను పరిరక్షించాలని, ఆక్రమణలకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. పట్టణ ప్రణాళిక, క్షేత్ర స్థాయి అధికారులు, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బందితో ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమావేశమై సమీక్షించారు. నగరంలోని ఆక్రమణలు తొలగించాలని, అందుకు అనువైన మాస్టర్ ప్లాన్‌ను ప్రతి ప్లానింగ్ సెక్రటరీ తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. ఆక్రమణలు జరగకుండా ముందే అడ్డుకోవాలని ఆదేశించారు. అక్రమంగా కట్టిన బ్యానర్లు, హోర్డింగ్‌లన తొలగించాలని, ఫ్లెక్సీలు లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనధికార హోర్డింగ్‌ల విషయంలో కఠినంగా ఉండాలని, తప్పనిసరిగా స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్ పరిశీలించాలని తెలిపారు. అందరూ సమన్వయంతో పని చేసి ఆక్రమణలు లేకుండా చూడాలని అన్నారు. సమావేశంలో సిటీప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డీసీపీ చంద్రబోస్, ఏసీపీ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ధర వరలు



వంకాయలు-46/54, టమాటా-34/36, బెండ-48, పచ్చిమిర్చి-36, కాకర-44, బీర-48, క్యాలీ ఫ్లవర్-20/25, క్యాబేజి-32, క్యారెట్-48, దొండ-30, బంగాళదుంప-38, ఉల్లిపాయలు-38/48, గోరు చిక్కుళ్లు-40, దోస-40, సొర-25/30, పొట్ల-20/25, అరటి కాయ-5/6, చామదుంప-36, అల్లం-70/140, మునగ-7/8, ఆకు కూరలు (కట్ట)-4, కంద-56, బీట్ రూట్-34, కీరదోస-32, బీన్స్-130, క్యాప్సికమ్-75, నిమ్మ (డజను)-32/40, కొత్తిమీర కట్ట-20/10, పుదీనా-5/20, ముల్లంగి-8, పచ్చిమామిడి-14/15 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి.

- ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

అన్ని జిల్లాల్లో బీసీ సమన్వయ కమిటీల ఏర్పాటు



సమావేశంలో పూర్ణచంద్రరావు, కేశవరావు, నాయకులు

నందిగామ, న్యూస్‌టుడే: బీసీ కులాల గణన చేపట్టాలంటూ ఉద్యమాలు నిర్వహిస్తామని రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ అధ్యక్షుడు అంగడాల పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడలో గురువారం బీసీ కుల సంఘాల సమావేశం నిర్వహించారు. అక్కడ సమన్వయ కమిటీ అధ్యక్షుడిగా పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు. స్థానిక బహుజన సేవా సమితి కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర కమిటీ వివరాలు ఆయన వెల్లడించారు. రాష్ట్ర బీసీ సమన్వయ కమిటీ కన్వీనర్‌గా బీసీ రమణ, కో కన్వీనర్లుగా డి.సూరిబాబు, కె.శ్రీరాములు, కె.నరసింహారావు, కదిరి రాము, పి.రామకృష్ణ, ఎ.రామచంద్రరావు, కరణం తిరుపతిరావు, మేక వెంకటేశ్వర్లు గౌడ్, ధరణికోట లక్ష్మీనారాయణ, మల్లవరపు సత్యనారాయణ, కోశాధికారిగా వరగాని ఏడుకొండలు, అధికార ప్రతినిధులుగా గోవిందును నియమించినట్లు తెలిపారు. కార్యనిర్వాహక సలహాదారులుగా విశ్రాంత డీజీపీ పూర్ణచంద్రరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశవరావు, హైకోర్టు న్యాయవాది వై. కోటేశ్వరరావును నియమించినట్లు తెలిపారు. పూర్ణచంద్రరావు మాట్లాడుతూ.. బీసీల సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందని చెప్పారు. అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో కమిటీలు నియమిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా కమిటీ పని చేస్తుందని పేర్కొన్నారు.

నగర బహిష్కరణ ఉత్తర్వుల ఉల్లంఘన

మధురానగర్: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ నుంచి బహిష్కరించినా పోలీస్ కమిషనర్ ఉత్తర్వులను ఉల్లంఘించి నగరంలో తిరుగుతున్న పోతిరెడ్డి రంగారెడ్డి (42) అనే పాత నేరస్థుడిపై నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. గురువారం మధ్యాహ్నం ఎస్సై మహాలక్ష్ముడు రాధానగర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా.. 7 అపార్ట్‌మెంట్ల వద్ద పోతిరెడ్డి రంగారెడ్డి కనిపించాడు. అతను పాత నేరస్థుడు కావడంతో, కమిషనరేట్ నుంచి బహిష్కరిస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను ఉల్లంఘించి, సరైన కారణం లేకుండా నగరంలోకి ప్రవేశించడంతో అతనిపై ఏపీ ప్రివెన్షన్ ఆఫ్ యాంటీ సోషల్ అండ్ హెజార్డస్ యాక్టివిటీస్ యాక్ట్ 1980, సెక్షన్ 10 కింద కేసు నమోదు చేశారు.

15 మందికి జరిమానా

సూర్యారావుపేట: ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు 5వ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అధికారులు.. తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా.. ఆరుగురికి రూ.15వేలు, 9 మందికి రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి లెనిన్‌బాబు తీర్పు ఇచ్చారు.


ఆర్డీవో మాధురికి స్వామివారి చిత్రపటం అందజేస్తూ

నెమలి కృష్ణుడి సేవలో ఆర్డీవో మాధురి

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాలస్వామిని తిరువూరు ఆర్డీవో కె.మాధురి శుక్రవారం రాత్రి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆమెకు దర్శనానంతరం అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. తెదేపా గ్రామ శాఖ అధ్యక్షుడు బెల్లం మధుసూదనరావు, అర్చకులు ఆమెకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

జి.కొండూరు, న్యూస్‌టుడే: బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుని డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని సెంట్రల్ బ్యాంకు విజయవాడ ప్రాంతీయ అధికారి వి.సతీష్‌బాబు కోరారు. స్థానిక సామాజిక భవనంలో శుక్రవారం ఆయా అధికారులు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం 20 డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.3 కోట్ల రుణాలు అందజేశారు. సెంట్రల్ బ్యాంకు డిప్యూటీ మేనేజర్ దయానందరావు, జి.కొండూరు, మైలవరం, గంగినేని, మైలవరం సెంట్రల్ బ్యాంకు మేనేజర్లు రోహిత్‌కుమార్, వంశీకృష్ణ, తిరుపాలనాయక్, సుధాకర్, వెలుగు ప్రాంతీయ సమన్వయకర్త రంగారావు, ఏపీఎం విజయలక్ష్మీ పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

తిరువూరు: 85005 44088 మైలవరం: 80085 74705

? రెడ్డిగూడెం నుంచి కుదప వెళ్లే మార్గంలో వ్యర్థాలు, చెత్త పడేస్తుండడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు
– కిశోర్ కుమార్, స్థానికుడు

✔ పంచాయతీ కార్యదర్శికి చెప్పి తొలగించే ఏర్పాట్లు చేస్తాం. టీకేవీ రమణ, ఎంపీడీవో
– న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

? కొండపల్లి వినాయకుని ఆలయం, ఆర్ వంపుల కాలనీ వద్ద తాగునీటి కుళాయిలు ప్రతి ఉదయం లీకవుతున్నాయి. నిరంతరం తాగునీరు రోడ్డుపైకి చేరుకోవడంతో [illegible] వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
– జంగల వెంకటేశ్వరరావు.

✔ ఆ ప్రాంతంలో తాగునీటి పైపులైన్లు మరమ్మతులకు గురయ్యాయి. సిబ్బంది కొరత వల్ల రెండు రోజులు పాటు పనులు నిర్వహించలేదు. ఆదివారం మరమ్మతులు నిర్వహిస్తాం. – వాసు, తాగునీటి సరఫరా పర్యవేక్షకులు
– న్యూస్‌టుడే, కొండపల్లి.

❖ పట్టణంలోని 5వ వార్డు సచివాలయం పరిధిలో 18వ వార్డులో ఎన్టీఆర్ సర్కిల్ పరిధిలో రహదారులపై చెత్త కుప్పలు ఉన్నాయని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో అక్కడి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు.


తిరువూరు 11వ వార్డు పరిధిలోని ఎన్నెస్పీ కాల్వ రోడ్డులో చెత్తను తొలగిస్తున్న కార్మికులు

❖ 6వ వార్డు సచివాలయం పరిధిలో 11వ వార్డులో ఎన్నెస్పీ కెనాల్ రోడ్డులో చెత్త ఉందని స్థానికుల ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందితో చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు.

❖ 2వ వార్డు సచివాలయం పరిధిలో 3వ వార్డులో ఆర్టీసీ కాలనీ రోడ్డులో మురుగు నీరు నిల్వతో దోమల వృద్ధి చెందుతున్నాయిన సమస్యను ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి సిబ్బందితో దోమల నిర్మూలనకు మందు పిచికారి చేయించారు.

❖ 4వ వార్డు సచివాలయం పరిధిలో 7వ వార్డు పరిధిలో దోమలు ఉన్నాయని స్థానికులు చేసిన ఫిర్యాదును ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన దోమల నిర్మూలనకు కాల్వలో మలాథియాన్ పిచికారి చేయించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు, కొణిజెర్ల, నెమలి, ఉమ్మడిదేవరపల్లి, గాదెవారిగూడెం, చింతలనర్వ గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్తలైన్ల ఏర్పాటు నేపథ్యంలో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈ ఎస్.ఈ జగదీష్ తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్

ఇబ్రహీంపట్నం: కుటుంబ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు స్వయం సహాయక సంఘ మహిళలు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రోత్సహించాలని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పి.శ్రీధర్ అన్నారు. మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం రింగుసెంటర్ వద్ద అర్బన్ మార్కెట్ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ పొదుపు సంఘాలకు చెందిన మహిళలు స్వయంగా తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలకు అక్కడ ఉంచారన్నారు. దీనిని అందరూ ప్రోత్సహించాలని సూచించారు. కొండపల్లి పురపాలిక పొదుపు సంఘ మహిళలు పాల్గొన్నారు.

వేగవంతం.. సర్వం సౌరమంత్రం

పల్లెల్లోనూ వెలగనున్న సౌర కాంతి

యూనిట్ల మంజూరుకు అనుమతులు

మైలవరం, న్యూస్‌టుడే

పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో భాగంగా కేంద్రం తీసుకొచ్చిన సౌరశక్తి పథకం గృహ వినియోగదారుల ఖర్చులకు కళ్లెం వేయనుంది. సులువుగా అనుమతుల మంజూరుతో పాటు, ఏర్పాటు తేలికగా ఉండడంపై విద్యుత్తు శాఖ కసరత్తులు చేస్తోంది. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పెద్ద ఎత్తున రాయితీలను అందిస్తోంది. సౌరశక్తి వినియోగం పల్లెల్లోకి ప్రవేశిస్తోంది. అయితే గతంలో రాయితీలున్నా ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ఆదరణ అంతంత మాత్రంగా మారింది. కేవలం ఎగువ మధ్యతరగతికి మాత్రమే అందుబాటులో ఉండడంతో, నగరాల్లో సైతం వేళ్లమీద లెక్కించే స్థాయిలో సౌరశక్తి యూనిట్ల ఏర్పాటు జరిగింది. దానిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర మధ్యప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో అడిగిన వినియోగదారుడికల్లా రోజుల వ్యవధిలోనే మంజూరు...ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడంతో మైలవరంలో ప్రాంతంలో పలు గ్రామాల్లో ఇప్పటికే గృహాలపై సౌర యూనిట్ల ఏర్పాటు జరిగింది.

రాయితీతో పాటు బ్యాంకు రుణం

ప్రస్తుతం ప్రభుత్వం కిలోవాట్ సామర్థ్యం మేరకు ఏర్పాటు చేసుకునే సౌర యూనిట్‌కు రూ.30 వేల వరకు రాయితీ సౌకర్యాన్ని కల్పించారు. మిగతా మొత్తంలో సుమారు 90 శాతం వరకు బ్యాంకుల నుంచి రుణ సౌకర్యం కల్పించే వెసులుబాటును అమల్లోకి తీసుకువచ్చారు. సాధారణంగా రోజువారి వినియోగం కనీసం 10 యూనిట్ల లోపు ఉండే వినియోగదారులకు 3 కిలోవాట్ల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తే సరిపోతుందని విద్యుత్తు శాఖాధికారులు చెబుతున్నారు. తొలుత వినియోగదారులు చెల్లిస్తే, రాయితీ సొమ్ములు వెంటనే బ్యాంకు ఖాతాకు జమ అవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం 100 వరకు సౌర పలకల ఉత్పత్తి సంస్థలు విద్యుత్తు నియంత్రణ మండలిలో ఒప్పందాలు చేసుకునే అందుబాటులో ఉన్న, మంచి గుర్తింపు ఉన్న కంపెనీల పలకలను ఎంపిక చేసుకునే అవకాశం వినియోగదారులకే కల్పిస్తున్నారు.

పథకం ప్రయోజనం ఇలా..

రాయితీ లభించే సామర్థ్యం	3 కిలోవాట్లు
రాయితీ మొత్తం	రూ.78 వేలు
3 కి.వా.నెల కనీస ఉత్పత్తి	400 యూనిట్లు
సగటు మధ్యతరగతి నెలవారీ గృహవినియోగం	300 యూనిట్ల లోపు
మిగులు ఉత్పత్తి కనీసం	100 యూనిట్లు
3 కి.వా. యూనిట్‌కు కావాల్సిన స్థలం	180 చ.అడుగులు


ఓ ఇంటిపైన ఏర్పాటు చేసిన సౌరశక్తి పలకలు

రెండ్రోజుల్లోనే మంజూరు

ప్రస్తుతం పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా యూనిట్ల మంజూరు విధానం సరళీకృతం చేయడంతో దరఖాస్తు చేసుకున్నాక రెండ్రోజుల వ్యవధిలోనే యూనిట్ మంజూరు, ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. అందుకోసం వినియోగదారులు దరఖాస్తులను https://pmsuryaghar.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చు. 3 కిలోవాట్ల యూనిట్ ద్వారా నెలకు కనీసం 400 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. దాని ఏర్పాటుకయ్యే ఖర్చు వారి నాలుగు సంవత్సరాల వినియోగంతో సరిపోతుంది. ఇప్పటికే మైలవరం ప్రాంతంలో యూనిట్ల ఏర్పాటు ప్రారంభమైంది. మా కార్యాలయాల్లో గానీ, గ్రామాల్లో సిబ్బంది ద్వారానైనా సంప్రదించవచ్చు.
– సుధాకర్, ఏడీఈ, మైలవరం సబ్ డివిజన్


పరీక్ష రాస్తున్న విద్యార్థులు



విజేతలతో ప్రిన్సిపల్, కరస్పాండెంట్

పోటీలతో విద్యార్థులకు ప్రోత్సాహం

మైలవరం, న్యూస్‌టుడే: విద్యార్థులను ప్రోత్సహించేందుకు, సామాజిక పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమని స్థానిక లిటిల్‌ఫ్లవర్ పాఠశాల ప్రిన్సిపల్ మార్గరెట్టు పేర్కొన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పరీక్షల్లో భాగంగా ఆ పాఠశాలలో శుక్రవారం 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశాలపై వ్యాసరచన పోటీ పరీక్ష నిర్వహించారు. పోటీల్లో ఎన్.సుందర్ నవదీప్, ఎల్ఎంవీ మాధ్వీ, కె.ముత్తయ్యలు మొదటి మూడు స్థానాలు సాధించి, బహుమతులు అందుకున్నారు. ప్రిన్సిపల్, కరస్పాండెంట్, ఉపాధ్యాయులు విజేతలను అభినందించారు.

తెగుళ్ల సమాచారం యాప్‌లో ఉంచాలి

మైలవరం, న్యూస్‌టుడే: వ్యవసాయ, ఉద్యాన పంటలను ఆశించే తెగుళ్లకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వ యాప్‌లో ఉంచడం ద్వారా శాస్త్రవేత్తల నుంచి పరిష్కార సూచనలు అందుతాయని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ టి.మాధవీలత సూచించారు. శుక్రవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో సబ్ డివిజన్‌లోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఎంపీఈవోలతో శిక్షణ సమావేశం నిర్వహించి, యాప్‌లో నిక్షిప్తంపై అవగాహన కల్పించారు. ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, డీఆర్‌సీ ఏడీఏ మోనీష, కేవీకే గిరికపాడు ఎఎంఎస్ ఎన్.రాజశేఖర్, మండల వ్యవసాయాధికారులు సంధ్యారాణి, రామ్‌కుమార్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీడీఏ మాధవీలత

నేత్ర దానం

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన విద్యావేత్త సీడీ.ప్రభాకరరావు (74) మృతి చెందగా అతని నేత్రాలను లయన్స్ క్లబ్ సభ్యుల చొరవతో కుటుంబ సభ్యులు శుక్రవారం ఎల్వీ.ప్రసాద్ కంటి ఆస్పత్రికి దానం చేశారు. వైద్యులు తిరువూరు వచ్చి మృతుడి నేత్రాల్లోని కార్నియాను సేకరించి తీసుకెళ్లారు. లయన్స్‌క్లబ్ సభ్యులు పి.వెంకటేశ్వరరావు, ఎ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కె.రాజేష్‌ఖన్నా, ఎన్.ప్రకాశ్‌రావు, ఎన్.రాఘవరావు తోడ్పాటునందించారు.


ప్రభాకరరావు

విద్యార్థులకు ఆంగ్లభాషపై ఉన్న ఫోబియా పోగొట్టండి

తిరువూరు, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు మారిన పాఠ్యపుస్తకాలపై పునఃశ్చరణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన పి.సత్యనారాయణరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆంగ్లభాషపై ఉన్న ఫోబియాను పోగొట్టేందుకు కృషి చేయాలని.. ధైర్యం చెప్పి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు.

ఉచిత ప్రయాణ హామీ అమలు చేయాలి

మైలవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ముఖ్య హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో మహిళలతో కలిసి ప్రదర్శన చేశారు.

ఎమ్మెల్సీ ఓటుకు 3,619 దరఖాస్తులు

మైలవరం, న్యూస్‌టుడే: ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి, మైలవరం నియోజకవర్గం నుంచి ఓటు కోసం 3,619 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో అందాయని తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి తెలిపారు. కనీసం మూడేళ్ల కిందట డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తులు ఓటరుగా నమోదుకు అవకాశం ఉందని పేర్కొన్నారు. నవంబరు 1వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో గానీ, నేరుగాగానీ దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఫారం 18తో పాటు అర్హత పత్రాల జిరాక్స్‌లపై గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో పత్రాలను సమర్పించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు, నివారణలపై విజయవాడ పోలీసు కమిషనరేట్ సైబర్ నేరాల విభాగం ఎస్సై శ్రీనివాసమూర్తి శుక్రవారం అవగాహన కల్పించారు.

పోలీస్ విధులపై వ్యాసరచన పోటీలు

తిరువూరు, న్యూస్‌టుడే: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా స్థానిక చైతన్య విద్యాలయంలో శుక్రవారం ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అమరవీరుల త్యాగాలు, సమాజంలో పోలీస్ సేవలు తదితర అంశాలపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొన్నారు.

తెలంగాణ మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నెమలి, ఆర్లపాడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలిలో శుక్రవారం తిరువూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన దాడులో మండలంలోని ఆర్లపాడుకు చెందిన చేబ్రోలు హనుమంతురావు 48 తెలంగాణ మద్యం సీసాలు అక్రమంగా తరలిసుండడంతో అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సత్యనారాయణవర్మ తెలిపారు. ఎస్సైలు కృష్ణవేణి, వెంకటకుమార్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.

మహిళపై దాడిలో ఘటనలో 8 మందిపై కేసు

గోసవీడు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని గోసవీడుకు చెందిన గద్దల హర్షితపై దాడి జరిగిన సంఘటనలో ఆమె భర్త శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన 8 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీను శుక్రవారం తెలిపారు. బుధవారం రాత్రి హర్షితపై గ్రామంలో దాడి జరగగా తిరువూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సకు చేరిన సంగతి తెలిసిందే. సంఘటనలో బాధితుల ఫిర్యాదు మేరకు గోసవీడుకు చెందిన గద్దల వినోద్, ప్రశాంత్, జయరాజు, దివ్య, దాసు, నాగమణి, పెద్దనాగమణి, మోషే అనే వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కొండపల్లిలో కబ్జాదారుల ఆగడాలు

కొండపల్లి: కొండపల్లిలో కబ్జాదారులకు చెరువు, వాగు, పోరంబోకు స్థలాలు ఏవీ ఆగడం లేదు. వాటికి ఇతర సర్వే నంబర్లు వేసి తప్పుడు కాగితాలు సృష్టించి అత్యాశపరులకు అమ్మేసి సొమ్ములు చేసుకొంటున్నారు. అటువంటిదే ఓ స్థల వివాదం శుక్రవారం చోటు చేసుకొంది. స్థానిక పబ్బతివాని చెరువు ప్రాంగణంలో జాతీయ రహదారి పక్కన కొందరు సిమెంటు రాళ్లతో కొంత ప్రాంతంలో నిర్మాణాన్ని చేపట్టారు. యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్న నిర్మాణ పనుల విషయం పురపాలిక సిబ్బందికి తెలిసి ఆ పనులను నిలిపారు. అయితే ఆ స్థలం తమేదనని ఓ ప్రజాప్రతినిధి పేరు చెప్పి ఓ మహిళ పురపాలిక సిబ్బందిని బెదిరిస్తోందని ఆరోపణలో వినిపిస్తున్నాయి.


మొక్కలు నాటుతున్న అధికారులు, ఉపాధి హామీ కార్మికులు

కాలుష్య నివారణకు సామూహిక వనమహోత్సవం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం),న్యూస్‌టుడే: గుంటుపల్లి రైల్వే వ్యాగన్‌వర్కుషాపు ప్రాంగణంలో శుక్రవారం ఉపాధిహామీ పథకంలో భాగంగా వనమహోత్సవం నిర్వహించారు. రైల్వే వ్యాగన్ వర్కుషాపు, ఉపాధిహామీ పథకం అధికారులు మాట్లాడుతూ..గుంటుపల్లి పరిసర గ్రామాల్లోని పరిశ్రమల నుంచి విడుదలవుతున్న కాలుష్య నివారణకు వ్యాగన్ వర్కుషాపునకు చెందిన స్థలంలో దశల వారిగా సామూహిక మొక్కలు నాటి సంరక్షిస్తామన్నారు. కార్యక్రమంలో ఉన్నతాధికారులు శివధర మోహన్, శ్రీనివాస్, రమణరెడ్డి, డ్వామా పీడీ రాము, ఎంపీడీవో సునితశర్మ, ఉపాధి హామీ పథకం అధికారులు ఉష, వెంకటేశ్వరరావు, ప్రమీళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: నియోజకవర్గ స్థాయి పాఠశాలల బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలో గుంటుపల్లి సెయింట్ ఆన్స్ విద్యార్థులు ప్రతిభ చాటారు. అండర్ 17 విభాగంలో వి.ఉమానాగ మహేశ్వరి 800 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయస్థానం సాధించింది. 4×100 రిలేలో జిల్లా స్థాయికి ఎంపికైంది. బాలుర అండర్ 17 విభాగంలో కె.శ్యాంప్రభుదేవ్ 200 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం సాధించాడు. 4×100 రిలేలో జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. అండర్ 14 విభాగంలో వంద మీటర్ల పరుగు పందెంలో ఎం.గీతిక ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో రెండో స్థానం, 4×100 మీటర్ల రిలేలో విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైంది. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు బాలరాజు, పుల్లారావు, ప్రధానోపాధ్యాయులు సిస్టర్లు జెయిన్ ఆంటోని, రోజిలీలు అభినందించారు.


విద్యార్థులతో ఉపాధ్యాయులు

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

మైలవరం, న్యూస్‌టుడే: పట్టభద్రులైన ప్రతి ఒక్కరు తమ ఓటును నమోదు చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.గంగరాజు, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు పేర్కొన్నారు. పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి నమోదు పత్రాలను అందజేశారు. రత్నకమల్, సీహెచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


ఓటు నమోదు పత్రాలు చూపుతున్న యూటీఎఫ్ నాయకులు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి వైకాపా ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓట్ల నమోదును స్థానిక బి.కాలనీ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటును నమోదు చేసుకోవచ్చన్నారు. శరభయ్య, పండు, బేగ్ తదితరులు పాల్గొన్నారు. ❖ సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓట్ల నమోదును కొండపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మందితో దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించారు. మండల కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణన ప్రారంభం

వావిలాల, మల్లేల(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని వావిలాల, మల్లేలలో శుక్రవారం జాతీయ పశుగణన ప్రారంభించినట్లు పశువైద్యాధికారిణి టి.శ్వేత, వీఎల్వో ఎం.గోపాలకృష్ణ తెలిపారు. ఐదేళ్లకోసారి నిర్వహించే పశు సంపద వివరాల సేకరణకు ఎన్యూమరేటర్లను ప్రభుత్వం నియమించినట్లు పేర్కొన్నారు.


తిరువూరు: గోడపత్రికల ప్రదర్శన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అఖిల భారత పశుగణన కార్యక్రమంలో భాగంగా రెడ్డిగూడెం మండల పశువైద్యశాఖ సిబ్బంది శుక్రవారం గ్రామంలో పశుగణన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్.డి.తులసి, సిబ్బంది విక్రమ్, రాజారావు పాల్గొన్నారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలో 21వ జాతీయ పశుగణన శుక్రవారం ప్రారంభించినట్లు నెమలి, గంపలగూడెం పశువైద్యాధికారులు డి.అభిలాష్, జి.సాయికృష్ణ తెలిపారు. అనంతరం పశుగణన గోడపత్రికలు ఆవిష్కరించారు.

పక్షం రోజుల్లో సమస్యలు తీరుస్తాం

కనుమూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని కనుమూరులో శుక్రవారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో 78 మంది రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందజేశారని తహసీల్దారు వి.రాజకుమారి తెలిపారు. పక్షం రోజుల్లో క్షేత్ర స్థాయి విచారణ పూర్తిచేసి పరిష్కరిస్తామన్నారు.


ఎ.కొండూరు : తహసీల్దారు ఆశయ్యకు అర్జీలు అందజేస్తున్న రైతులు

మైలవరం, న్యూస్‌టుడే: గణపవరంలో రెవెన్యూ గ్రామసభలో 40 మంది రైతులు అర్జీలు అందజేసినట్లు తహసీల్దార్ జి.బాలకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

వల్లంపట్ల(ఎ.కొండూరు): వల్లంపట్లలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో 67 మంది రైతులు అర్జీలు అందజేశారని తహసీల్దారు బి.ఆశయ్య తెలిపారు.

ఇబ్రహీంపట్నం గ్రామీణం: గుంటుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దారు వెంకటేశ్వర్లు పాల్గొని రైతులకు రీసర్వేపై అవగాహన కల్పించారు.

వేతన బకాయిలు చెల్లించండి

కొండపల్లి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికుల ఆర్థిక స్థితిగతులను గుర్తించి వారికి చెల్లించాల్సిన వేతనాలను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు కోరారు. కొండపల్లి పురపాలిక కార్యాలయంలో కమిషనర్ బీపీ శ్రీనివాసరావును శుక్రవారం ఆయన కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు నెలల వేతనాలు కార్మికులకు రావాల్సి ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం వారికి ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఏఐటీయూసీ అనుబంధ పారిశుద్ధ్య కార్మిక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మధిర శాఖ కాల్వకు 801 క్యూసెక్కుల సాగర్‌జలాలు

గంపలగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కప్పలబంధం నియంత్రిక నుంచి శుక్రవారం మధిర బ్రాంచి కెనాల్‌కు 801 క్యూసెక్కుల సాగర్‌జలాలు విడుదలైనట్లు ఏఈ మహేష్ తెలిపారు.

నాడు వందల్లో.. నేడు పదుల్లో

వసతిగృహాల్లో తగ్గుతున్న విద్యార్థులు

వసతుల లోపమే ప్రధాన కారణం

మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

వసతిగృహాలు ఏయేటికాయేడు పలచబడుతున్నాయి. ప్రభుత్వాలు మెనూలో ఎప్పటికప్పుడు భారీ మార్పులు చేపడుతున్నట్లు చెబుతున్నా, వసతి పొందుతున్న విద్యార్థుల సంఖ్యలో భారీ తేడాలొస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు వసతిగృహాలను గురు, శుక్రవారాల్లో 'న్యూస్‌టుడే' పరిశీలన చేయగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.


మైలవరం డీఎన్‌టీ బాలుర వసతిగృహంలో దోమల మెష్‌లకు చిల్లులు

30 మంది లోపే : మైలవరంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో 6వ తరగతి నుంచి విద్యార్థులు వసతి పొందుతున్నారు. గతంలో ఏటా 120 నుంచి 150 మంది వరకు విద్యార్థులుండగా, ప్రస్తుతం 30 మంది లోపే ఉన్నారు. ❖ మరుగుదొడ్లు, స్నానాల గదుల్లోకి నీటిని బకెట్లతో తీసుకెళ్లాల్సి వస్తోంది. ❖ తాగేందుకు 20 లీటర్ల రెండు డబ్బాలతో బయటకు కొని తెస్తున్నట్లు పిల్లలు చెబుతున్నారు.


జి.కొండూరు: మరమ్మతులు చేయాల్సిన మరుగుదొడ్డి


మెస్ లేని కిటికీలు

150 మంది ఉండాల్సింది

స్థానిక డీఎన్‌టీ బాలుర వసతిగృహంలో 60 మందికి లోపే ఉన్నారు. ఇక్కడా నాలుగేళ్ల కిందటి వరకు కనీసం 150 మందికి పైగా వసతి పొందారు. ❖ ఈ వసతిగృహంలో ప్రతి కిటికీకి దోమతెరలను ఏర్పాటు చేయగా, కొన్ని చోట్ల కొద్దిపాటి చిరుగులు పడ్డాయి.❖ విద్యార్థులు పడుకోవటానికి నాలుగేళ్ల కిందట ఇనుప మంచాలను సరఫరా చేసినా, ఇబ్బందుల పేరిట అప్పటి నుంచి ఉపయోగించకపోవడంతో, నేలపై చాపలు వేసుకుని పడుకుంటున్నారు.

❖ జి.కొండూరులోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలోని విద్యార్థులను పరిశీలించగా 30 మంది విద్యార్థులు ఉన్నారు.

❖ తలుపులు, కిటికీలు సక్రమంగా ఉన్నా మెష్‌లు ఏర్పాటు చేయలేదు. ❖ మరుగుదొడ్ల పరిస్థితి బాగానే ఉన్నా పరిశుభ్రంగా లేవు.

పరిశీలన


రెడ్డిగూడెం బాలుర బీసీ వసతి గృహంలో నేలపై పడుకొన్న విద్యార్థులు

కేవలం ఐదుగురే ఇక్కడ

మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని బాలుర బీసీ వసతి గృహంలో 26 మంది విద్యార్థులు ఉండాల్సి ఉండగా కేవలం 5గురు మాత్రమే ఉన్నారు. వారికి కూడా కనీస సౌకర్యాలు అందుబాటులో లేవు. హాస్టల్ గదులకు కిటికీలు లేవు. దోమలు రాకుండా మెష్‌లు లేవు..మరుగుదొడ్లకు తలుపులు లేవు. ఇదేమని నైట్ వాచ్‌మెన్ కె.శ్రీనుని అడగ్గా ఉన్నారు. సౌకర్యాలు లేకపోవడంతో తమ సొంత ఇళ్లకు వెళ్లి పోయారన్నారు.

వైరా ఏటిపై కాజ్‌వే నిర్మించాలని వినతి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గోళ్లమూడి గ్రామం వద్ద వైరా ఏటిపై కాజ్‌వే/చెక్‌డ్యాం నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఆ గ్రామ తెదేపా అధ్యక్షుడు గాడిపర్తి శ్రీనివాసరావు గురువారం రాత్రి వినతిపత్రం అందజేశారు. 2019లో ప్రభుత్వం కాజ్‌వే, చెక్‌డ్యాం నిర్మించడానికి రూ.13.65 కోట్లు మంజూరు చేస్తూ జీవో నెం-115 జారీ చేసింది. వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. ఆ జీవోను రద్దు చేసిందని ఆయన మంత్రికి వివరించారు. దీనిపై మంత్రి స్పందించి జలవనరుల శాఖ ద్వారా మళ్లీ ప్రతిపాదనలు పంపాలని సూచించారని గాడిపర్తి చెప్పారు. గతంలో ఎస్సీ శ్మశాన వాటికకు 0.84 సెంట్ల స్థలం సేకరించారని, స్థల యజమానికి ప్రభుత్వం ద్వారా పరిహారం మంజూరు చేయించాలని మంత్రిని కోరారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

తారు రోడ్డు అభివృద్ధి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వ పాలనలో నిర్లక్ష్యానికి గురైన రహదారికి కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగింది. పెద్దవరం గ్రామం నుంచి చెర్యుకొమ్ముపాలెం వరకు పంచాయతీ రహదారి గతంలో గుంతలతో రాకపోకలకు అసౌకర్యంగా ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మైనింగ్ నిధులు రూ.95 లక్షలతో 1.7 కిలోమీటర్ల మేర రహదారిని తారుతో అభివృద్ధి చేశారు. ఆ రెండు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పెద్దవరం నుంచి కంద్రపాడు గ్రామం వరకు రహదారిపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేయించారు.



మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

జగ్గయ్యపేట: 8008 574714, నందిగామ: 8008 574713

స్పందనకు వందనం

✦ చెన్నారావుపాలెం సచివాలయం పక్క వీధి కాలువలో చెత్త పేరుకుపోయి నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోందని గ్రామానికి చెందిన రామవరావు 'ఈనాడు' 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా సమస్యను పంచాయతీ కార్యదర్శి ప్రియాంక దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె కాలువను శుభ్రం చేయించారు.

✦ చట్టన్నవరం ఎస్సీ కాలనీ ఎంపీపీ పాఠశాల వద్ద చెత్తకుప్పలు రోజుల తరబడి ఉంటున్నాయని గ్రామానికి చెందిన వీరేష్ సమస్యను పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సిబ్బందితో చెత్తను తొలగింపజేశారు.

✦ పెద్దాపురం-జయంతి రహదారి శివాలయం సమీపంలో వీధి దీపం వెలగడం లేదని గ్రామానికి చెందిన కోటేశ్వరరావు విద్యుత్తు శాఖ ఇన్‌ఛార్జి ఏఈ కృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన సిబ్బందితో నూతన వీధి దీపాన్ని ఏర్పాటు చేయించారు.

✦ జయంతి బీసీ కాలనీలో రహదారిపై కంకర కుప్పలు అడ్డుగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు 'మేమున్నాం.. మీకుతోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సంబంధిత యజమానితో మాట్లాడి కంకర తీయించారు. - న్యూస్‌టుడే, వీరులపాడు

గ్రామ సమాఖ్య సమావేశం

పేరకలపాడు (కంచికచర్ల), న్యూస్‌టుడే: మండలంలోని పేరకలపాడులో శుక్రవారం గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్ ఎన్టీఆర్ ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో తిరిగి చెల్లించడం వలన కలిగే లాభాలను వివరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎస్.అరుణ మాట్లాడుతూ.. పేరకలపాడు గ్రామంలో గతంలో వీఓఏగా పని చేసిన వేమవరపు స్వరూపపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్పంచి మన్నె సాత్విక, సీసీ యశోద, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అరకొర వసతి గృహాలు!

నందిగామ గ్రామీణం, పెనుగంచిప్రోలు - న్యూస్‌టుడే

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు కొన్నింటిలో సమస్యలు వెంటాడుతున్నాయి. వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తున్నారు. భవనాలు కూలే దశలో ఉన్నాయి. గచ్చు, స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. స్నానాల గదులకు నీటి సరఫరా లేక ఆరుబయటే చేస్తున్నారు. ఆయా విషయాలు 'న్యూస్‌టుడే' పరిశీలనలో తేలాయి.

బకెట్లతో నీరు తీసుకెళ్లాల్సిందే..

- నందిగామ ఎస్సీ బాలురు-1 వసతి గృహంలో ఇక్కడ 3- 10 వరకు 50 మంది విద్యార్థులు ఉన్నారు.
- గదుల్లో గచ్చు పగిలింది. స్లాబ్ పెచ్చులూడుతోంది. కొన్ని గదుల తలుపులు పగిలాయి. కిటికీల మెస్‌లు చిరిగాయి.
- మరుగుదొడ్లకు నేరుగా నీటి సరఫరా లేదు. బక్కెట్లతో తీసుకెళ్తున్నారు. ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. ప్రభుత్వం దుప్పట్లు పంపిణీ చేసింది.

దుప్పట్లు లేక ఇక్కట్లు

- నందిగామ ఎస్సీ బాలుర(కళాశాల) హాస్టల్‌లో 60 మంది ఉంటున్నారు.
- ఇక్కడ విద్యార్థులకు ఇంకా దుప్పట్లు ఇవ్వలేదు. ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చుకున్నారు. నీటి వసతి బాగానే ఉంది.

కూలే దశలో మరుగుదొడ్లు

- నందిగామ బీసీ బాలుర (కళాశాల) వసతి గృహంలో 76 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు.
- మంచాలు సమకూర్చారు. బెడ్‌షీట్లు, దుప్పట్లు మాత్రం ఇవ్వలేదు. ఇంటి నుంచి తెచ్చుకున్నవి వాడుతున్నారు.
- మరుగుదొడ్లు కూలే దశలో ఉన్నాయి. వసతి గృహం స్లాబ్ పెచ్చులూడింది. ఇనుప చువ్వలు బయటపడ్డాయి. గోడలు బీటలిచ్చాయి. మెనూ అమలు చేస్తున్నారు.



నందిగామ ఎస్సీ బాలుర వసతి గృహం-1లో పెచ్చులూడిన స్లాబ్



నందిగామ బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో దుప్పటి లేకుండా నిద్రిస్తూ..

ఆరుబయటే స్నానాలు

పెనుగంచిప్రోలులో బీసీ బాలుర వసతి గృహంలో 3 నుంచి 10వ తరగతి వరకు 50 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ వార్డెన్‌కు నందిగామ, జుజ్జూరు వసతి గృహాల అదనపు బాధ్యతలు అప్పగించారు. గురువారం రాత్రి ఆయన లేరు. వాచ్‌మెన్ ఉన్నారు. ప్రైవేటు పెంకుటిల్లులో వసతి గృహం నడుస్తోంది. ఫ్యాన్‌లు, కిటికీలకు మెస్‌లున్నారు. నాలుగు మరుగుదొడ్లు ఉన్నాయి. స్నానాల గదులు లేవు. ఆరుబయటే స్నానాలు చేస్తున్నారు. మెనూ అమలు చేస్తున్నారు.





ఎగసిపడుతున్న జలాలు.. పచ్చదనంతో పొలాలు

మండలంలోని గుమ్మడిదుర్రు సమీపంలో రైతులు వ్యవసాయ బావి నుంచి విద్యుత్తు మోటారు ద్వారా వరి పొలానికి సాగునీరు అందిస్తున్నారు. చుట్టు పచ్చటి పైరు మధ్యలోనున్న బావి నుంచి ఎగిసిపడుతున్న జలాలు చూపరులకు కనువిందు చేస్తోంది.

–న్యూస్‌టుడే, పెనుగంచిప్రోలు

కబడ్డీ విజేత ఎస్ఆర్‌కే కళాశాల



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏసీపీ రవికిరణ్

కంచికచర్ల, న్యూస్‌టుడే: స్థానిక మిక్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ కబడ్డీ టోర్నమెంటులో విజయవాడ ఎస్ఆర్‌కే కళాశాల జట్టు విజయం సాధించింది. నందిగామ ఏసీపీ రవికిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని పోటీలను తిలకించి విజేతలను అభినందించారు. రన్నరప్‌గా కిట్స్ కళాశాల, తృతీయ స్థానంలో కంచికచర్ల మిక్ కళాశాల నిలిచాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ టి.వంశీకిరణ్, సీఈవో డి.పాండురంగారావు, డా.జి.పి.రాజు, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి వై.శ్రీకాంత్, టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.శౌరయ్య, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న ఆంజనేయులు

జుజ్జూరు (వీరులపాడు), న్యూస్‌టుడే: సీపీఎం పేదల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆంజనేయులు అన్నారు. జుజ్జూరులో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడుతూ.. రైతు, కార్మిక సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తామన్నారు. ఎర్రుపాలెం నుంచి నూతనంగా నిర్మించనున్న రైల్వే లైనులో భూములు కోల్పోయే రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీకి నిర్వహించిన ఎన్నికలో మండల కార్యదర్శిగా చాట్ల రవి, సభ్యులుగా పల్లెకంటి బాబు, షేక్ లాల్ అహ్మద్, గడ్డం ప్రభాకర్, స్వామి తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు కోట కల్యాణ్, జిల్లా కమిటీ సభ్యుడు చనుమోలు సైదులు, వట్టికొండ పార్థసారథి, కోడూరు పిచ్చేశ్వరరావు, సుందర్రావు తదితరులు పాల్గొన్నారు.

పతకాల సాధన అభినందనీయం



ఎమ్మెల్యే సౌమ్యకు మొక్క ఇస్తున్న క్రీడాకారులు

నందిగామ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నందిగామ క్రీడాకారులు రాణించాలని స్థానిక ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కోరారు. స్థానిక కాకానినగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో విజేతలను ఆమె అభినందించారు. గన్నవరం నియోజకవర్గం కేసరపల్లిలో నిర్వహించిన పోటీల్లో నందిగామకు చెందిన వారియర్స్ జిమ్‌కు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో బంగారం, వెండి, రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నందిగామకు మంచి పేరు తీసుకొచ్చినందుకు గర్వంగా ఉందని చెప్పారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సన్మానించారు.

రెవెన్యూ గ్రామసభలు

చందర్లపాడు: పాటెంపాడులో జరిగిన జగనన్న సర్వేలో అభ్యంతరాల స్వీకరణకు రెవెన్యూ సిబ్బంది శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. సర్వేపై 36 మంది రైతులు అభ్యంతరాలు తెలుపుతూ.. వినతి పత్రాలు అందజేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ పాల్ తెలిపారు. ఆర్ఐ శివ, ఇన్‌ఛార్జి సర్వేయర్ విశ్వనాథం, వీఆర్వో కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గతంలో ఈ గ్రామంలో భూములకు రీసర్వే నిర్వహించారు. భూమి విస్తీర్ణాల్లో వ్యత్యాసాలపై రైతుల నుంచి ఆరు అర్జీలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీరాములు, మండల సర్వేయరు భోజ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.

భూ తప్పిదాలపై అర్జీల స్వీకరణ

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని లింగగూడెంలో శుక్రవారం రెవెన్యూ గ్రామ సభ జరిగింది. గతంలో జరిగిన భూ సర్వేలో తప్పిదాలపై భూ యజమానుల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించారు. ఈ సర్వేలో తప్పులు దొర్లాయని పలువురు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దారు శాంతిలక్ష్మి, మండల సర్వేయర్ స్వప్న, ఆర్ఐ అబ్దుల్ హలీం, వీఆర్వో లివింగ్‌స్టోన్, గ్రామ నాయకుడు మురుకుట్ల వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

గనుల పరిశీలన

జగ్గయ్యపేట గ్రామీణం: స్థానిక రాంకో సిమెంట్ ఆధ్వర్యంలో జరిగిన 39వ గనుల భద్రత వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎ.నాగేంద్ర, ఎం.విశ్వనాథ్‌రెడ్డి, ఎ.శ్రీనివాసరావు బూదవాడ, జయంతిపురం, రావిరాల గనులను పరిశీలించి వాటి భద్రత విషయంపై మాట్లాడారు. పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులిచ్చారు. ప్రెసిడెంట్ ఆశిష్ కుమార్ శ్రీవాస్తవ, కన్వీనర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పథకాల వద్ద ఇసుక తవ్వకాలు నిషేధం

వత్సవాయి, న్యూస్‌టుడే: మునేరులో వాల్టా చట్టాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో తాగునీటి పథకాల వద్ద ఇసుక తవ్వకాలను నిషేధిస్తున్నట్లు తహసీల్దారు నరసింహారావు శుక్రవారం తెలిపారు. లింగాల వద్ద మునేరులో పలు రక్షిత పథకాలు ఉన్నందున ఆ ప్రదేశంలో తవ్వకాలు చేయకూడదని చెప్పారు. చట్ట విరుద్ధంగా తవ్వితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణంలోని 15వ వార్డు కౌన్సిలర్ ఇర్రి నరసింహారావును ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పరామర్శించారు. తాతయ్య చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీ ద్వారా ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేయించుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన విషయం తెలుసుకొని ఆయన గృహానికి వెళ్లి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

తల్లిదండ్రుల సమావేశం

కంచికచర్ల: కంచికచర్ల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. విద్యార్థులకు 75 శాతం కంటే తక్కువ హాజరు ఉంటే కాండోనేషన్ ద్వారా పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, ప్రభుత్వం ఇచ్చే తల్లికి వందనం సాయం రాదని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న తీరుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ హఫీజ్ షేక్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

27న పునఃప్రతిష్ఠ

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణంలోని పాలేటి ఒడ్డునున్న కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 27న స్వామి వారిని బాలాలయంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శివాలయం ట్రస్టు సభ్యులు శుక్రవారం తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

దేవస్థానం పాలకవర్గాల్లో స్థానం హర్షణీయం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : దేవస్థానాల పాలకవర్గాల్లో సభ్యులుగా నాయీ బ్రాహ్మణులకు స్థానం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానం కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణుల సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ తెదేపా సాధికార కమిటీ సభ్యుడు కొలిపాక బ్రహ్మం, నాగేశ్వరరావు, ఏలూరి కృష్ణ, చిననాగబాబు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డిపో అధికారి వైఖరిపై నిరసన



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : జగ్గయ్యపేట ఆర్టీసీ డిపోలో అధికారుల తీరుకు నిరసనగా ఉద్యోగులు శుక్రవారం నిరసన తెలిపారు. ఓ అధికారి సిబ్బందిని నోటికి వచ్చినట్లు దూషిస్తున్నారని డిపో కార్యదర్శి ఏ.ఆనంద్ తెలిపారు. డిపో అధ్యక్షుడు కల్యాణం కృష్ణారావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పసుపులేటి శ్రీనివాసరావు, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాంబశివరావు, జిలానీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విజయవాడ సెక్యూరిటీ విజిలెన్స్ అధికారికి డిపోలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని వినతిపత్రం అందించారు.

ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులకు చేయూత!

☛ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సన్నాహాలు ☛ సొమ్ములివ్వకుండా ఆపేసిన గత పాలకులు

కంచికచర్ల, న్యూస్‌టుడే

కాదేదీ కక్ష సాధింపునకు అనర్హం అన్నట్టు వ్యవహరించిన గత వైకాపా ప్రభుత్వ తీరుతో సొంత గూడు కోసం అష్టకష్టాలు పడుతున్న పేదలు సైతం బలయ్యారు. 2014-19 మధ్య కాలంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం చేయూతనివ్వాలని నిర్ణయించింది. సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు రూ.2 లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు రూ.2.50 లక్షలు ఇచ్చింది. ప్రభుత్వ ప్రకటనతో లబ్ధిదారులు సంతోషంగా ఇళ్ల నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేసింది. తరువాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి బిల్లుల చెల్లింపు నిలిపేసింది.

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల వివరాలు	
మండలం	బకాయిలున్న లబ్ధిదారులు
చందర్లపాడు	817
కంచికచర్ల	1021
నందిగామ	761
వీరులపాడు	728
జగ్గయ్యపేట	872
పెనుగంచిప్రోలు	665
వత్సవాయి	1168

రుణం తీసుకొని...

సొంత గూడు కట్టుకోవచ్చనే ఆశతో అప్పు తెచ్చి మరీ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిన పేదలు కొందరైతే, ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే వదిలేసిన వారు కొందరు. తాజాగా కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టిన లబ్ధిదారుల వివరాలు, గృహాల ప్రస్తుత పరిస్థితిపై నివేదిక కోరిన నేపథ్యంలో లబ్ధిదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో బిల్లుల బకాయి రూ.55 కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం ఆగిపోయి బకాయిలు రావాల్సిన లబ్ధిదారుల సంఖ్య సుమారు 6,032 మందిగా గుర్తించారు.



వీరులపాడు మండలంలో సర్వే నిర్వహిస్తున్న గృహ నిర్మాణ శాఖ అధికారి

నివేదిక పంపిస్తాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు వివిధ దశల్లో ఆగిన ఇళ్ల సర్వే పూర్తి చేశాం. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తాం. త్వరలోనే లబ్ధిదారులకు బిల్లులు జమ అవుతాయి. - టి.శివాజీ, డీఈ, హౌసింగ్

'ఉపాధి' పనుల్లో అవకతవకలు



ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిపై ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

తాటిగుమ్మి (వీరులపాడు), న్యూస్‌టుడే: గ్రామంలో లేని, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్న వ్యక్తుల పేరు మీద దొంగ మస్టర్లు వేసి అవకతవకలకు పాల్పడ్డారంటూ తాటిగుమ్మి గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు పి.శ్రీనివాసరావుపై గ్రామస్థులు సామాజిక తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహించిన వివిధ పనులపై శుక్రవారం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. పథకంలో చోటుచేసుకున్న అవకతవకలపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలను అధికారులకు సమర్పించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు అతనిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఉపాధిహామీ పథకం అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిల్ తీర్మానంపై డిసెంట్ అందజేత

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆడిటోరియానికి వాయువ్య మూలన ఉన్న గేటును మూసివేసి పూర్వం ఉన్న దుకాణాలను పునఃనిర్మాణం చేయుటకు సాధారణ సమావేశంలో ప్రతిపాదించడం పట్టణ ప్రణాళిక నిబంధనలకు వ్యతిరేకంగా ఉందని మున్సిపల్ వైస్ ఛైర్మన్ హఫీజున్నిసా తెలిపారు. రూ.రెండు కోట్ల విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో నిర్మాణం చేపట్టిన టౌన్ హాల్ పట్టణంలో ఉన్న 50 వేల మందికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. దీనికి రెండు వైపులా రోడ్లు ఉంటే బాగుంటుందన్నారు. అనంతరం దీనిపై మున్సిపల్ కమిషనర్ రాంమోహన్‌రావుకు, ఛైర్మన్‌కు డిసెంట్‌ను సమర్పించారు.

మాగల్లు వంకాయకు గుంటూరులో గిరాకీ



వంగ బస్తాలతో ఆటో

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కెట్లో వంకాయలకు మంచి గిరాకీ ఏర్పడింది. ఇటీవల వరకు గిట్టుబాటు ధర లేదని రైతులు ఆందోళన చెందారు. వరదలకు కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. చాలా ప్రాంతాల్లో కూరగాయలకు కొరత ఏర్పడింది. ఉన్న సరకుకే గిరాకీ ఏర్పడి ధరలు పెరిగాయి. మాగల్లు గ్రామంలో పండించిన వంకాయలను రైతులు గుంటూరు మార్కెట్‌కు ఆటోల్లో తరలించి విక్రయిస్తున్నారు. కిలో వంకాయలకు రూ.30 ధర ఇస్తున్నారని రైతులు తెలిపారు. ఆటో ఖర్చులు పోను తమకు గిట్టుబాటు ధర వస్తుండటంతో గుంటూరు తరలించి విక్రయిస్తున్నామని వివరించారు. మాగల్లు నుంచి రోజుకు 50 క్వింటాళ్ల వంకాయలు గుంటూరు వెళ్తున్నాయి. గతంలో విజయవాడ మార్కెట్ వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం గుంటూరుకు తామే తరలించి విక్రయిస్తున్నామని, మంచి ధర వస్తోందని రైతులు తెలిపారు.

మురుగు తొలగదు.. అవస్థలు వీడవు



కంచికచర్ల, న్యూస్‌టుడే: కంచికచర్ల ప్రధాన రహదారిలోని స్థానిక మండల కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా మురుగు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కన చేరిన వర్షం నీటిని తొలగించాలని, నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరాల ఏర్పాటు



శనగపాడులో ప్రదర్శన చేస్తున్న సిబ్బంది

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని అనిగండ్లపాడు, కొణకంచి ఆయుర్వేద ఆస్పత్రి వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం శనగపాడు, కొణకంచి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యులు వై. రత్నప్రియదర్శిని, కె.వాణి, సిబ్బంది పాల్గొని రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఆయుర్వేద వైద్యంపై అవగాహన ప్రదర్శన చేశారు.

స్పందించారు.. తొలగించారు

స్పందనకు వందనం



రోడ్డు పక్కన కంప చెట్లు తొలగించాక ఇలా..

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే : 'కంప చెట్లు.. వాహనదారులకు ఇక్కట్లు' అనే శీర్షికన ఈ నెల 23న 'ఈనాడు' ప్రచురితమైన కథనానికి మండలంలోని బలుసుపాడు గ్రామస్థులు స్పందించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు పసుల నరసింహారావు, గ్రామ ఆటో యూనియన్ సహకారంతో రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను శుక్రవారం తొలగించారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

విజయవాడ తూర్పు

పశుగణన సిబ్బందికి సహకరించండి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : జిల్లా వ్యాప్తంగా నిర్వహించే అఖిల భారత పశుగణనకు సంబంధించిన గోడ ప్రతులను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం నియోజకవర్గ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇంటింటా సర్వే చేయడానికి వచ్చే సిబ్బందికి తాము పెంచుతున్న జంతువుల వివరాలు తెలియజేయాలని ప్రజలను కోరారు. పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడు డాక్టర్ వి.గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న హెచ్‌ఎం జ్యోతిరాధ, ఉపాధ్యాయులు



వ్యాసరచనలో విద్యార్థులు

ప్రతిభకు పదును

పటమట, న్యూస్‌టుడే: పటమట లంకలోని వల్లూరి సరోజినిదేవి పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలుగా నిలిచిన ఎస్.బాలా భాస్కర్(10వ తరగతి), ఎల్.నేహల్ వర్మ(10వ తరగతి), బి.హరీష్(9వ తరగతి)లకు హెచ్‌ఎం ఎస్.జ్యోతి రాధ, ఉపాధ్యాయులు వై.రవిశంకర్, ఎం.అనురాధ బహుమతులు అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

80085 74652

స్పందనకు వందనం

★ మహానాడు రోడ్డు క్రాంతి వైన్స్ ఎదురుగా పైపు లీకేజీతో నిరంతరం వృథాగా పోతుందని నివాసి నారాయణరావు మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి మరమ్మతులు చేయించారు.

? కృష్ణలంక రామలింగేశ్వర నగర్ ఆక్ష చెల్లారావు వీధిలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి ప్రమాదభరితంగా ఉన్నాయి. - జగదీశ్వరరావు

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం - సతీష్ కుమార్, విద్యుత్ ఏఈ

? కృష్ణలంక రామలింగేశ్వర నగర్ కార్మెల్ ఫెయిత్ హోం చర్చి ఎదురుగా వీధి స్తంభానికి ఉన్న దీపం వెలగడం లేదు - వి.వై.కె.రావు

✔ పరిశీలించి లైట్ దీపాన్ని ఏర్పాటు చేస్తాం -ప్రభాకర్ రావు, ఏఈ - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

పుట్టగొడుగుల్లో పోషక విలువలు

లబ్బీపేట(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థ మహిళా కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి మష్రూమ్ అధినేత పి.జ్యోతి మాట్లాడుతూ... మష్రూమ్‌లో ఎన్నో పోషక విలువలు ఉంటాయని తెలిపారు. వాటిని పెంచే విధానం గురించి తెలియజేశారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఆర్.మాధవి, వృక్ష శాస్త్ర విభాగాధిపతి టి.సలోమి పాల్గొన్నారు.

కామన్ ఇంట్రెస్ట్ సంఘాల ఏర్పాటుపై సమీక్ష

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు సిద్ధం చేయాలని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ కుల్దీప్ నారాయణ్ అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కార్పొరేషన్ ముఖ్య అధికారులతో ఆయన సమావేశమై కామన్ ఇంట్రెస్ట్ గ్రూపుల ఏర్పాటుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రూపుల ఏర్పాటు చేస్తే.. వాటిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. వాటికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాల్సి ఉందని చెప్పారు. కామన్ ఇంట్రెస్ట్ గ్రూపుల ఏర్పాటుకు విశాఖపట్నం, విజయవాడలను కేంద్రం ఎంపిక చేసిందని వెల్లడించారు. దీనిపై నవంబరు 1 నుంచి సర్వే చేయాల్సి ఉండగా, నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికే సర్వే చేసి 150 గ్రూపులను గుర్తించడం అభినందనీయమని అన్నారు. 6 కేటగిరీల్లో గ్రూపుల ఏర్పాటు చేయాలని తెలిపారు. నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్ మిషన్ 2.0 కింద కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులను రూపకల్పన చేస్తున్నట్లు వివరించారు. అధికారులు డి.చంద్రశేఖర్, కె.ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్.ఆదినారాయణ, వి.ప్రభావతి, జి.రంగాచార్యులు, ఎస్ఎస్‌ఆర్.శ్రీనివాసులు, లత, పణికుమార్, శేఖర్, శ్యామల, సుజాత, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కుల్దీప్ నారాయణ్

వేధింపులకు మహిళలు భయపడొద్దు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : మహిళలను వివిధ రకాలుగా వేధిస్తున్నారని, వాటికి భయపడకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని, మహిళా సంఘాలు, న్యాయస్థానాలు రక్షణగా నిలుస్తాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యువతుల సమస్యలు - పరిష్కారాలు అనే అంశంపై మొగల్రాజపురంలోని జన శిక్షణ సంస్థాన్ కార్యాలయంలో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలు గడుస్తున్నా.. ఇంకా మహిళలపై వివక్ష కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ విశ్రాంత పీడీ కె.సుహాసినిదేవి మాట్లాడుతూ... కొన్నేళ్లతో పోల్చుకుంటే మహిళల్లో అక్షరాస్యత పెరిగిందని, శాస్త్ర, సాంకేతిక రంగాల్లోనూ రాణిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలను తక్కువగా చూడటం మానుకోవాలని సూచించారు. జన శిక్షణ సంస్థాన్ ఛైర్‌పర్సన్ ఎన్.విద్యాకన్నా, డైరెక్టర్ ఎ.పూర్ణిమ తదితరులు మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన సేవ్ వ్యవస్థాపకురాలు జ్యోత్స్న సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.



మాట్లాడుతున్న రమాదేవి, వేదికపై పూర్ణిమ, సుహాసినిదేవి, విద్యాకన్నా

చిన్నారికి ఎమ్మెల్యే పరామర్శ

పటమట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎం సహాయనిధికి సరైన అర్థం చెప్పారని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.5 లక్షలతో వైద్యం చేయించుకుని ఇంటికి వచ్చిన 11వ డివిజన్‌కు చెందిన బాలిక జియాను ఆమె నివాసంలో ఎమ్మెల్యే గద్దె శుక్రవారం పరామర్శించారు. అనంతరం మందుల నిమిత్తం గద్దె రామ్మోహన్ సొంత నిధుల నుంచి రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. నాయకులు కోనేరు రాజేష్, రాజనాల పవన్ తదితరులు పాల్గొన్నారు.



జియా కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గద్దె

వసతి నిలయం.. సమస్యల విలయం

గుణదల(పటమట), న్యూస్‌టుడే

గుణదల గంగిరెద్దుల దిబ్బ వద్ద ఉన్న బాలుర బీసీ సంక్షేమ వసతి గృహం సమస్యలకు నిలయంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సరైన వసతి సదుపాయాలు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. ఆహారం నాణ్యత లేదు. కలుషిత నీరు వస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. దుప్పట్లు, మంచాలు లేక చలికి వణుకుతూ తీవ్ర అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



విద్యార్థుల గదుల పక్కన చెత్త

అవస్థలు ఇవీ..

☛ ఆహారం నాణ్యతగా ఉండట్లేదు.

☛ ఒక్కో గదిలో 20 మందిపైగా విద్యార్థులు ఉంటున్నారు. ఇరుక్కొని పడుకుంటున్నారు.

☛ మూడేళ్ల కిందట మరమ్మతులకు గురైన స్నానాల గదులు బాగు చేయలేదు. కాలకృత్యాలు తీర్చుకునే మరుగుదొడ్లనే స్నానాలకు వినియోగిస్తున్నారు.

☛ వసతి గృహం ప్రహరీ కూలి నాలుగు సంవత్సరాలు అవుతున్నా తిరిగి నిర్మించలేదు.

☛ పోలీసుల నిఘా తక్కువగా ఉండడంతో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల సంచారం అధికంగా ఉంది.

☛ రాత్రి ఆకతాయిలు వసతి గృహం ఆవరణలోకి చేరి సెల్‌ఫోన్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. ☛ దుప్పట్లు సరఫరా చేయలేదు. మంచాలు ప్రభుత్వం ఇచ్చినా బిగించలేదు. మూడేళ్ల నుంచి అలాగే ఉన్నాయని విద్యార్థులు చెబుతున్నారు. చేసేదిలేక చలికి వణుకుతూ నేలమీదే పడుకుంటున్నారు.

☛ వసతి గృహం పరిసర ప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులు కింద పడుకుంటే ఎలుకలు కాళ్లు కొరుకుతున్నాయని చెబుతున్నారు.



గడి లేని తలుపు



అధ్వానంగా మరుగుదొడ్లు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పాయకాపురం(మధురానగర్), న్యూస్‌టుడే: మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో వాస్తు హౌసింగ్ ఫైనాన్స్, భారత్ కేర్స్ ఆధ్వర్యంలో 160 మంది మహిళలకు పరిశ్రమల స్థాపనపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కండ్రికలోని కేర్ అండ్ షేర్ సెంటరులో శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కండ్రిక, కృష్ణలంక, క్రీస్తురాజపురం తదితర ప్రాంతాలకు చెందిన మహిళలకు వ్యవస్థాపక అభివృద్ధి, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలో శిక్షణ ఇచ్చారు. వ్యాపార స్థాపన, అభివృద్ధి, కార్యకలాపాల నిర్వహణపై అవగాహన కల్పించారు. నిర్వాహకులు పూజా భారతి, ఆశిష్ త్రిపాఠి, చిరంజీవి తదితరులు మాట్లాడారు. కొత్త వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన మెటీరియల్ సమకూరుస్తామని తెలిపారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ డైరెక్టర్ అజంతా కుమార్ మాట్లాడుతూ.. ఇక్కడ పెంపొందించుకున్న నైపుణ్యాలతో మంచి భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నున్న ఎస్సై విమల, వీఆర్వో శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరాలని ట్రాఫిక్ డీసీపీ కృష్ణమూర్తినాయుడు అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని మొగల్రాజపురంలోని అమృత హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను ప్రస్తావిస్తూ... కేవలం నిర్లక్ష్యం, రాంగ్ పార్కింగ్, నిబంధనలను పాటించకపోవడమే రద్దీకి కారణమని చెప్పారు. ద్విచక్రవాహనం నడిపేటప్పుడు శిరస్త్రాణం ధరించాలని కోరారు. ట్రాఫిక్ నియంత్రణ గురించి వివరించారు. ట్రాఫిక్ సీఐ వై.రవికుమార్, ఎస్ఐ జీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ గట్ల సుందరీకరణ: కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని కాలువ గట్ల వెంట వ్యర్థాలను పూర్తిగా తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మధురానగర్ ప్రాంతంలోని కెనాల్ బండ్ ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రధానంగా ఏలూరు కాలువ బండ్ ఆక్రమణకు గురికాకుండా చూడాలని, రెండువైపులా కంచె అమర్చి మొక్కలు నాటాలని అన్నారు. ప్రజల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, పాత్‌వే, పిల్లల ఆట వస్తువులు అమర్చాలని ఆదేశించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.



అధికారులకు సూచనలిస్తున్న ధ్యానచంద్ర

వ్యర్థాలు ఇలా.. స్వచ్ఛత ఎలా?

ఏనిమిదో డివిజన్ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులోని మైనేని కూడలి సమీపంలోని ఓ అంతర్గత రహదారిపై చెత్తకుప్పలు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కొద్ది రోజుల నుంచి తొలగించడం లేదు. దుర్వాసన వెలువడుతోందని స్థానికులు చెబుతున్నారు. దోమలు, ఈగలతో ఆ ప్రాంతం అధ్వానంగా మారింది. వాటిని తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



- మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

27న కెరీర్ ఫెయిర్

పటమట, న్యూస్‌టుడే: ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్‌లో హైదరాబాద్ పీజీజీల అకాడమీ ఆధ్వర్యంలో కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 12 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి దేశంలోని 36 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఆయా విశ్వవిద్యాలయాల్లో కోర్సులు, ఫీజులు, వివిధ సబ్జెక్టు కాంబినేషన్లు తదితర అంశాల గురించి విద్యావేత్తలు వివరిస్తారని, సలహాలు, సూచనలు ఇస్తారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అమరావతి రైల్వే లైన్ రాష్ట్రానికి భారీ ప్రోత్సాహం

పటమట, న్యూస్‌టుడే: అమరావతి రైల్వే లైనుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌లకు, దీని కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని ప్రాంతానికి దేశంలోని పలు ప్రాంతాలతో అనుసంధానం పెరగనుందని తెలిపారు. రూ.2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వే లైనుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడం రాష్ట్రానికి భారీ ప్రోత్సాహమని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

ప్రతిభ పోటీల్లో రాణింపు

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : సిద్ధార్థ ఫార్మసీ కళాశాల ఫార్మాకాగ్నసీ విభాగం, విశ్వ ఆయుర్వేద పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయుర్వేద ఫర్ పబ్లిక్ హెల్త్ అనే అంశంపై మొగల్రాజపురంలోని కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉపన్యాస, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ ఆంటోని సునీల, వేదమంత్ర ఆయుర్వేదిక్ హాస్పిటల్ డాక్టర్ సాహితి, సురక్ష నాన్‌సర్జికల్ ఆయుర్వేద హాస్పిటల్ ఎండీ డాక్టర్ పూర్ణచంద్రేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ఐదో డివిజన్ క్రీస్తురాజపురానికి చెందిన విద్యార్థిని మొక్షిత దివిజ్‌కు తెదేపా సైకిల్ వితరణగా ఇచ్చింది. డివిజన్ అధ్యక్షులు నందిపాటి దేవానంద్ నేతృత్వంలో ప్రధాన కార్యదర్శి యలమంచిలి రాజేష్ సభ్యులు నర్రా సుబ్బారావు, గల్లా రవి, కోమారి సున్నిహృదయం, షేక్ షరీఫ్, దండమూడి సన్నిధి, హనీఫ్ దానిని అందజేశారు.

ఆరోగ్య కేంద్రం ఏర్పాటు ఎప్పుడో?



గీతానగర్ కరకట్ట దిగువున నిలిచిన వైద్యశాల భవన నిర్మాణం

కృష్ణలంక, న్యూస్‌టుడే

నగరంలోని 16వ డివిజన్ ప్రజలు ఆరోగ్య కేంద్రం కోసం ఎదురుచూస్తున్నారు. గతంలో తమ ప్రాంతానికి మంజూరైన వైద్యశాల మరో చోటికి మార్చేశారని, ఫలితంగా తాము ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డివిజన్ పరిధిలోని భూపేష్‌గుప్తానగర్, కూనగర్, గీతా నగర్, కోటి నగర్, సత్యనారాయణ నగర్, పూర్ణచంద్రనగర్ తదితర ప్రాంతాల్లో నిరుపేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా జీవిస్తున్నారు. వైద్యం కోసం వ్యయ ప్రయాసలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ ప్రాంతంలో వైద్యశాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

నగరంలో నిలిచి..

గత వైకాపా ప్రభుత్వం ముఖ్యమంత్రి పట్టణ ఆరోగ్య కేంద్రాల స్థానంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. అందులో భాగంగా 16వ డివిజన్‌కు ఒక కేంద్రం మంజూరైంది. కేంద్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ కేటాయించడంతో గీతానగర్ కట్ట దిగువున సుమారు 35 సెంట్ల స్థలంలో ఆరోగ్య కేంద్రం నిర్మాణం ప్రారంభించారు. కొద్ది రోజులకే ఆ స్థలం 39/1 సర్వే నంబరులో ఉన్నందున నీటి పారుదల శాఖకు చెందుతుందంటూ ఉద్యోగులు అడ్డుకున్నారు. ఫలితంగా నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో స్థలానికి ప్రతిగా నున్నలో సుమారు 72 సెంట్ల స్థలాన్ని అప్పటి జాయింట్ కలెక్టర్ ప్రతిపాదించినప్పటికీ ఫలితం లేకపోయింది. రాజకీయ జోక్యంతో ఆరోగ్య కేంద్రం కాస్తా 18వ డివిజన్ రాణిగారితోట సిమెంట్ గోదాంకు తరలిపోయింది.



సిమెంటు గోదాములో ఏర్పాటు చేసిన ఆరోగ్య కేంద్రం

అరకొర సేవలే..

సిమెంటు గోదాములో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసినప్పటికీ ఇప్పటికీ ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. దీర్ఘకాలంగా వైద్యుడి నియామకం చేపట్టలేదు. ల్యాబ్‌లో అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం లేదు. అన్ని విభాగాలకు సరిపడా సిబ్బంది లేనందున నామమాత్రపు సేవలతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

30న మహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ఈ నెల 30న మహాలక్ష్మి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వైదిక కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. యాగంలో పాల్గొన దలచిన ఉభయ దాతలకు టిక్కెటు రుసుము రూ.1000గా నిర్ణయించినట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పటమట, న్యూస్‌టుడే: పటమటలంక కొమ్మా సీతారామయ్య జడ్పీ బాలికోన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ఆహార కమిషన్ ఛైర్మన్ చిత్తా విజయ ప్రతాప్‌రెడ్డి తనిఖీ చేశారు. కందిపప్పుకు బదులు శనగపప్పు వాడటాన్ని, కోడిగుడ్డు తక్కువగా ఉండటాన్ని హెచ్ఎంను ప్రశ్నించారు. వండిన ఆహారాన్ని తిని ఇంకా మంచిగా వండాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ సురేష్, ఎంఈవో పోలా రామారావు తదితరులు పాల్గొన్నారు.

★ రేషన్ సరకులు కార్డుదారులకు సక్రమంగా అందేలా చూడాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు పోషకాహారాన్ని అందించాలని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ విజయ ప్రతాప్ రెడ్డి అన్నారు. శుక్రవారం అశోకనగర్‌లోని రాష్ట్ర ఆహార కమిషన్ కార్యాలయంలో ప్రజా పంపిణీ వ్యవస్థ, మహిళా, శిశు సంక్షేమం, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. కమిషన్ సభ్యులు శ్రీలక్ష్మిరెడ్డి, జె.దేవి, ఉప సంచాలకులు పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : పటమట ఆరోగ్య కేంద్రం పరిధిలో శుక్రవారం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని పర్యటించారు. ఇంటింటా సర్వే చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న స్థానికులకు దోమలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

ముగిసిన 'ఐస్టా' ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలోని అయిదు రోజుల పాటు జరిగిన శ్రీబెజవాడ శ్రీకృష్ణారెడ్డి ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీ ముగిసింది. చివరి రోజైన శుక్రవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన ఫైనల్స్‌లో పలువురు క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. సింగిల్స్ 35+ కేటగిరీలో ఈశ్వర్ సాయి, అశ్విన్‌కుమార్, 45+ కేటగిరీలో వహీద్, కేవీఎస్ మూర్తి, 55+ కేటగిరీలో సుధాకర్‌రెడ్డి, ఆర్ఎస్.రావత్, 65+ కేటగిరీలో శ్రీనివాస్‌రెడ్డి, జే చంద్ర, 70+ కేటగిరీలో సేతు, కె.రాధాకృష్ణమూర్తి వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

★ డబుల్స్ 35+ కేటగిరీలో ఈశ్వర్‌సాయి-జానకిరామరాజు జోడీ, బి.మహేశ్వరరావు - ఆర్.రాంబాబు జోడీ, 45+ కేటగిరీలో కేవీఎస్ మూర్తి-వహీద్ జోడీ, ఎంఎస్ కిరణ్-మణికిషన్ జోడీ, 55+ కేటగిరీలో రాజ్‌కుమార్‌సింగ్-ఎ.శ్రీనివాసరావు జోడీ, కేశవప్రసాద్-ఆర్ఎస్ రావత్ జోడీ, 65+ కేటగిరీలో శ్రీనివాస్‌రెడ్డి - సతీష్‌రాజు జోడీ, మన్మథరావు-ధనుంజయులు జోడీ, పీకే పట్నాయక్ - సుందర్ వడివేలు జోడీ, 70+ కేటగిరీలో రాంబాబు - సేతు జోడీ, 75+ కేటగిరీలో రామకృష్ణ - భాస్కరరావు జోడీ, శేషసాయి - వీపీఎస్ నాయుడు జోడీ వరుస స్థానాల్లో నిలిచాయి. రాష్ట్ర టెన్నిస్ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, విశ్రాంత జడ్జి రామకృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేతలతో అతిథులు

అధిక్యంలో నీలాష్ సాహ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్ఎస్‌పీబీ)కు చెందిన అంతర్జాతీయ మాస్టర్ నీలాష్ సాహా (2467) 7.5 పాయింట్లతో అధిక్యంలో కొనసాగుతున్నాడు. స్థానిక ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న బీఎస్‌కేయూ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నీలో శుక్రవారం ఎనిమిదో రౌండ్ ముగిసే సరికి నీలాష్ సాహ ప్రథమ స్థానంలో కొనసాగుతున్నాడు. శుక్రవారం ఎనిమిదో రౌండ్ పోటీని డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్ ప్రారంభించారు.

ఫుట్‌బాల్ విజేత సింగ్‌నగర్ క్లబ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో రెండు రోజుల పాటు జరుగుతున్న జిల్లా జూనియర్ రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీలో సింగ్‌నగర్ ఫుట్‌బాల్ క్లబ్ అండర్-18 కేటగిరీలో విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో రెండేసి గోల్స్ సాధించాయి. చీకటి పడడంతో ఇరుజట్లకు టాస్ వేసి విజేతను నిర్ణయించారు. దీనిలో సింగ్‌నగర్ ఎఫ్‌సీ జట్టు టాస్ గెలుచుకుంది. అండర్-15 కేటగిరీ ఫైనల్ మ్యాచ్‌లో హంటింగ్ టైగర్స్ జట్టు 1-0 గోల్స్ తేడాతో జేవియర్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టుపై గెలుపొందింది. ముగింపు కార్యక్రమానికి క్రెడై సుధాకర్ హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వై.శేషగిరిరావు, జేవియర్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షుడు బి.శామ్యూల్ రత్నం, కార్యదర్శి బి.చక్రవర్తి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


అంతర్జాతీయ క్రీడాకారుడికి చేయూతనివ్వండి

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అంతర్జాతీయ కిక్ బాక్సర్ కోటి నాగబాబు స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని శాప్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడుని కలిసి ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు చేయూతనివ్వాలని కోరారు. ఈ నెల 3 నుంచి 16వ తేదీ వరకు కంబోడియా దేశంలో జరిగిన ఏషియన్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచి సాధించిన పతకాలను ఛైర్మన్‌కు చూపించారు. ఛైర్మన్ బదులిస్తూ... అవసరమైన ఆర్థిక సాయాన్ని శాప్ ద్వారా కాని, ప్రాయోజకుల ద్వారా కాని అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

'శాప్ నిధులు దుర్వినియోగం'

గత ప్రభుత్వం శాప్ నిధులను ఆడుదాం ఆంధ్ర పేరుతో దుర్వినియోగం చేసిందని శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఇటీవల చైనాలో జరిగిన పారా బీచ్ వాలీబాల్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకాలు గెలుపొందిన ఎ.గణేష్, ఎం.వెంకటరమణ శుక్రవారం శాప్ కార్యాలయంలో ఛైర్మన్ రవినాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. సాధించిన పతకాలకు ప్రభుత్వం నుంచి రావలసిన నగదు ప్రోత్సాహకాలు అందేలా చూడాలని కోరారు. ఛైర్మన్ మాట్లాడుతూ నగదు ప్రోత్సాహకాలు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

★ క్రీడా కోటా పరంగా క్రీడాకారులకు జరుగుతున్న నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని శాప్ ఛైర్మన్ రవినాయుడుకు వినతి పత్రం సమర్పించానని రాష్ట్ర కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి కేపీ రావు పేర్కొన్నారు.



విజయవాడ పశ్చిమ

30న మహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ఈ నెల 30న మహాలక్ష్మి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వైదిక కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. నూతన యాగశాలలో ఉదయం 8 గంటలకు రుద్ర హోమం పూర్తయిన తర్వాత ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యాగంలో పాల్గొన దలచిన ఉభయ దాతలకు టిక్కెటు రుసుము రూ. 1000గా నిర్ణయించినట్లు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

భవానీపురం: 80085 74638

? పాల ఫ్యాక్టరీ ఫంక్షన్ హాల్ ఎదురుగా గంగానమ్మ గుడి పక్కన కాలువ దెబ్బతిని ప్రమాదభరితంగా ఉంది. **-ఎస్.ఈశ్వరరావు, భీమనవారిపేట**

✔ పరిశీలించి మరమ్మతులు చేసేలా చూస్తాం. **-ఏఈ శ్రీనివాస్**

? కేఎల్‌రావు నగర్ కుమ్మరి వీధిలో గుజ్జారి ఎల్లారావు మార్కెట్‌లో మరుగుదొడ్ల దుర్వాసన వస్తున్నాయి. **-కె.ప్రసాద్‌బాబు, చిట్టినగర్**

✔ శుభ్రం చేయిస్తున్నాం. దుర్వాసన లేకుండా బ్లీచింగ్ చల్లిస్తాం. **-వేణుగోపాల్, శానిటరీ అధికారి**

స్పందించారు.. శుభ్రం చేశారు

స్పందనకు వందనం



చిట్టినగర్ సొరంగం మార్గంలో అపరిశుభ్రంగా ఉందని విద్యాధరపురం ప్రాంతానికి చెందిన సీహెచ్.లక్ష్మణ్‌కుమార్ 'ఈనాడు' మేమున్నాం. మీకు తోడుగా దృష్టికి తీసుకువచ్చారు. ఆ సమస్యపై ఆయా ప్రాంతం శానిటరీ అధికారి నరసింహారావు స్పందించారు. పారిశుద్ధ్యం కార్మికులతో సొరంగం మార్గం పరిశుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, చిట్టినగర్**

హిందీ నాటకానికి మొదటి బహుమతి

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : విజయవాడ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో సికింద్రాబాద్‌లో నిర్వహించిన 'కపిరాజ్' నాటకానికి మొదటి బహుమతి లభించింది. అవార్డును రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌జైన్ చేతుల మీదగా అందుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావు పాటిల్, ఏడీఆర్‌ఎంలు కొండా శ్రీనివాసరావు, ఎడ్విన్‌లు నాటకంలో పాల్గొన్న వివిధ విభాగాల ఉద్యోగులను అభినందించారు.

విద్యార్థులకు సంచుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ : భారత మహిళామండలి సభ్యురాలు విజయశ్రీ మనువడు హిత్విక్ ధీర్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. మహిళామండలి అధ్యక్షురాలు ఆర్.శ్రీలక్ష్మిదేవి, కామేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమామ్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలోచనలకు ఆవిష్కరణల రూపం

చిట్టినగర్, న్యూస్‌టుడే

ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు, నూతన ఆవిష్కరణలు సమాజానికి ఎంతో అవసరం. ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకుని సమాజ శ్రేయస్సుకు దోహదపడే పలు ప్రాజెక్టుల రూపకల్పనకు నేటి యువత అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులు ఆకట్టుకుంటున్నాయి. వీటి ఉపయోగాల గురించి తెలుసుకుందాం.

వ్యవసాయానికి మేలు చేసే అగ్రికల్చరల్ రోబోట్

భారత్ వ్యవసాయాధారిత దేశం. ఇలాంటి తరుణంలో చదువుకున్న వారు కూడా వ్యవసాయం చేసే విధంగా ఆధునిక సాంకేతికతతో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు ఈఈఈ చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు లిఖిత, శివ, అనుష్క. పంట దిగుబడి ఎక్కువ రావడానికి ఎరువులు వాడతాం. పురుగు మందులు, ఎరువుల వల్ల భూసారం దెబ్బతింటోంది. అలా కాకుండా 'అగ్రికల్చరల్ రోబోట్'ని ఉపయోగించి పొలంలో మొక్కలకు కావాల్సినంత నీరు అందించే విధంగా, మొక్కలు ఎదుగుదలకు మొక్క కాండం వద్దనే ఎరువులు వేసేలా దీన్ని ఉపయోగించవచ్చు. పొలంలో ఎక్కడైన పురుగు పట్టిన మొక్కలను గుర్తించి వాటికే మందు పిచికారి చేసేలా ఇది పని చేస్తుంది. దీంతో ఎరువులు, మందుల ఖర్చు తగ్గుతోంది. ఈ రోబోట్‌ను కేవలం రూ.2,200ల ఖర్చుతో విద్యార్థులు రూపొందించారు.



రోబోట్ గురించి వివరిస్తున్న విద్యార్థిని

తక్కువ ఖర్చుతో విద్యుత్తు ఉత్పత్తి :

సహజంగా మనం ఇంట్లో మొక్కలు పెంచుతాం. వాటి నుంచి విద్యుత్తును తయారు చేసుకునే విధంగా ఈఈఈ తృతీయ సంవత్సరం చదువుతున్న చరణ్, ప్రవీణ్, నారాయణరావు, ఠాగూర్, సంజయ్‌వర్మ అనే విద్యార్థులు ఈ ప్రాజెక్టును రూ. 1700ల ఖర్చుతో రూపొందించారు. మొక్కల్లో ఫొటో సింథసిస్, మైక్రోబియల్ ఫ్యూయల్ విభాగంపై ఆధారపడి ఉంటుంది. మొక్కల కుదుళ్లలో మైక్రోబియల్ ఫ్యూయల్ సెల్(ఎం.ఎఫ్.సి), ఎలక్ట్రోకెమికల్ యాక్టివ్(ఈ.ఏ.బీ) బాక్టీరియా ఉంటుంది. రాగితో యానోడ్‌గా, జింకును క్యాథోడ్‌గా ఉపయోగించడం వల్ల ఆ బ్యాక్టీరియా సేంద్రియ పదార్థాన్ని విద్యుత్తుగా మారుస్తోంది. ఓల్టేజ్‌ని జోడించడానికి సిరీస్ కనెక్షన్‌ని ఉపయోగించి ప్రయోగం చేయడం వల్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. దీంతో తక్కువ ఖర్చుతో కరెంటు ఉత్పత్తి చేయవచ్చు.



ఎలక్ట్రిసిటీ ఫర్ ప్లాంట్స్ నమూనా

డ్రైవర్‌ని అప్రమత్తం చేస్తుంది

సరకు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి చేరవేసేందుకు కంటైనర్లు, లారీలను ఉపయోగిస్తాం. బస్సుల్లో సుదూర ప్రయాణం చేయాలన్నా చోదకులదే ప్రధాన పాత్ర. ఎక్కువ గంటలు వాహనం నడపడం వల్ల వల్ల డ్రైవర్లు అలసిపోయే అవకాశం ఉంది. తద్వారా నిద్ర వచ్చి తెలియకుండానే కునుకు వేస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో యాంటీ స్లీపింగ్ అలారం వల్ల డ్రైవర్లు ఐ బ్లింక్ సెన్సార్‌తో కూడిన కళ్లజోడు ధరించాలి. డ్రైవింగ్‌లో రెప్ప వాలినా 5 సెకన్ల లోపు వెంటనే అలారం మోగుతోంది. అయినా డ్రైవర్ తేరుకోకపోతే 10 సెకన్లలో వాహనం ఆటోమేటిక్‌గా ఇంజిను ఆగిపోయి కదలదు. డ్రైవర్ మళ్లీ వాహనాన్ని స్టార్ట్ చేసే వరకు అలారం మోగుతూనే ఉంటోంది. ఈ విధానం వల్ల ప్రమాదాలను అరికట్టవచ్చు. దీన్ని ఈఈఈ విద్యార్థినులు రమ్య, అమృత, అక్షిత, మాధుర్యలు రూ. 4,000లు వెచ్చించి తయారు చేశారు.



యాంటీ స్లీప్ అలారం ప్రాజెక్టు

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : కాళేశ్వరరావు మార్కెట్ కూడలిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వన్‌ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం చర్యలు చేపట్టారు. 'ట్రాఫిక్ ఇలా.. ప్రయాణం ఎలా..?' అనే శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. పాదచారులకు, వాహన చోదకులకు, కాళేశ్వరరావు మార్కెట్, పవర్ల షాపింగ్ కాంప్లెక్సు, హెడ్ పోస్టాఫీసుకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా ఆక్రమణదారులను నియంత్రించారు. బస్సు స్టేజీ వద్ద ఆక్రమణలు లేకుండా ఉండేలా, నిర్దిష్ట స్థలాల్లో తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకోవాలని, ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఇష్టారాజ్యంగా నిలపవద్దని అవగాహన కల్పించారు.



అవగాహన కల్పిస్తున్న వన్ ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు

ఈనాడు కథనానికి స్పందన

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : హాకర్లు ట్రాఫిక్ నిబంధనలకు సహకరించి వ్యాపారాలు చేసుకోవాలని ఏడీసీపీ రామకృష్ణ అన్నారు. కాళేశ్వరరావు మార్కెట్ కూడలిలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారడాన్ని పరిగణనలోకి తీసుకుని ఆయన నేతృత్వంలో పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ హాకర్లకు శుక్రవారం క్షేత్రస్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎదురయ్యే పరిణామాలను వారికి వివరించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే సహించేది లేదని హెచ్చరించారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా హాకర్లు వ్యాపారం చేసుకోవాలని సూచించారు.



పండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏడీసీపీ రామకృష్ణ, పక్కన అధికారులు

సమస్యల పరిష్కారానికి వారధి

భవానీపురం, న్యూస్‌టుడే : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వారధి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పలువురి వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ వారధి కార్యక్రమంలో తెలిపే సమస్యలు, ఫిర్యాదులను త్వరతగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ, నాయకులు శివన్నారాయణ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పురందేశ్వరి

సమాజ వికాసానికి పాటు పడాలి

చిట్టినగర్, న్యూస్‌టుడే : విద్యార్థులు తమ ఆవిష్కరణ ద్వారా సామాజిక వికాసానికి పాటు పడాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా ఏపీ సెంట్రల్ ఛైర్మన్ సీహెచ్.వెంకట శ్రీరామ్, కార్యదర్శి ఎం.ఎల్.ఎస్.దేవకుమార్ అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ విభాగం ఆధ్వర్యంలో ప్రాజెక్టు ఎక్స్‌పో- 2024 శుక్రవారం నిర్వహించారు. వారిద్దరు మాట్లాడుతూ ప్రతిభతో పాటు నైపుణ్యాలు ఉన్న వారికి విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయని, వాటి అందిపుచ్చుకోవాలని సూచించారు. అనంతరం ఎక్స్‌పోలో విజేతలకు కళాశాల కార్యదర్శి అమరసుధీర్ చేతుల మీదుగా నగదు బహుమతులు అందించారు. న్యాయ నిర్ణేతగా గుణదలలోని ఎలక్ట్రికల్ కేంద్రం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తాటికొండ శ్రీనివాసరావు వ్యవహరించారు. కళాశాల కోశాధికారి రాఘవయ్య, ప్రిన్సిపల్ పతంజలి శాస్త్రి, ఈఈఈ విభాగాధిపతి బాలకృష్ణ పాల్గొన్నారు.



ప్రదర్శన తిలకిస్తున్న వెంకట శ్రీరామ్ తదితరులు

కార్మికుల సమస్యలే ప్రధాన అజెండా



ర్యాలీలో భానుప్రసాద్, రాఘవేంద్ర

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : కార్మికుల సమస్యలే ప్రధాన అజెండాగా ఎంప్లాయిస్ సంఘ్ పని చేస్తుందని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి భరణీ భాను ప్రసాద్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం విజయవాడలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంప్లాయిస్ సంఘ్ డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్ర, ఆమంచి వెంకటేశ్వరరావు, యడ్ల నాగేంద్రబాబు, అల్లంశెట్టి రమేష్, డేగల శ్రీనివాస్, కొయ్యా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. అంతే సంగతులు..!

❖ రక్షణ చర్యలు లేని విద్యుత్తు నియంత్రికలు



కామకోటి నగర్: తక్కువ ఎత్తులో విద్యుత్తు నియంత్రిక



చిట్టూరి కాంప్లెక్సు సమీపంలో ఆటోల చాటున ఇలా..

విద్యాధరపురం, న్యూస్‌టుడే

గట్టు వెనక ప్రాంతంలో రక్షణ లేని విద్యుత్తు నియంత్రికలు ప్రమాదాలకు కేంద్రాలుగా మారాయి. రోడ్డు ఎత్తు పెరుగుతుండటంతో దశాబ్దాల కిందట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఫ్యూజ్ బాక్సులు చిన్నారులకు చెయ్యి ఎత్తకుండానే అందుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు చదువుకునే పాఠశాలల వద్ద ఉన్న వాటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయక పోవడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ట్రాన్స్‌కో అధికారులు వీటిపై దృష్టి సాగించకపోవడంతో ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయి. ముఖ్యంగా నోరు లేని జీవాలు, విద్యార్థులు వీటి బారిన పడుతున్నారు. రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసే నియంత్రికలు, వాటి తీగలను తాకడంతో ఆవులు, గేదెలు చనిపోయిన ఘటనలు నమోదవుతున్నాయి. ఏడాది కిందట ఆర్టీసీ వర్కు షాపు రోడ్డులో విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. గతంలో లేబరు కాలనీలో పచ్చగడ్డి మేయడానికి వెళ్లి గేదె చనిపోయింది.

నేలను తాకుతున్న తీగలు

చిన్నపాటి వర్షం కురిసినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల వద్ద విద్యుదాఘాతం కారణంగా సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కామకోటి నగర్‌లోని స్మార్త పాఠశాల పక్కన ఉన్న విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. బడికి వెళ్లే విద్యార్థులు ఇక్కడ క్రీడలు ఆడుతుంటారు. ప్రమాదవశాత్తు అటు వైపు వెళ్తే ప్రమాదం జరుగుతుందని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అండిమాని బ్రహ్మయ్య వీధి, పార్థసారధి వీధి, భావన్నారాయణ వీధి, వర్కు షాపు రోడ్డు, సంజయ గాంధీ కాలనీల్లో కొన్ని నియంత్రికల తీగలు తక్కువ ఎత్తులో ఉన్నాయి. కొన్ని అయితే నేలను తాకుతున్నాయి.

దిమ్మెలపైన ఏర్పాటు చేస్తాం

రక్షణ లేని విద్యుత్తు నియంత్రికలను దిమ్మెలపైన ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్నిచోట్ల సిమెంటు రోడ్లు వేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ల దిమ్మెలను ఎత్తు పెంచాల్సిన అవసరం ఏర్పడింది. వాటి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. తీగలు నేలను తాకకుండా చర్యలు చేపడతాం. మూగ జీవాలకు కేబుల్స్ అందకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేస్తాం.

- సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో ఏఈ

వీనుల విందుగా శివానందలహరి పారాయణం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇంద్రకీలాద్రిపైనున్న కళావేదికపై విజయవాడకు చెందిన వి.ప్రసన్న కుమారి బృందం శుక్రవారం శివానందలహరి పారాయణం చేశారు. ఆది దంపతుల విశిష్టతను వివరించారు. జగన్మాత దర్శనం చేసుకున్న భక్తులు ఆసక్తిగా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం ఇందులో పాల్గొన్న వారికి దేవస్థానం సిబ్బంది ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలను అందజేశారు.



కాలువ గట్ల సుందరీకరణ

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని కాలువ గట్ల వెంట వ్యర్థాలను పూర్తిగా తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మధురానగర్ ప్రాంతంలోని కెనాల్ బండ్ ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రధానంగా ఏలూరు కాలువ బండ్ ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, రెండువైపులా కంచె అమర్చి మొక్కలు నాటాలని అన్నారు. ప్రజల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, పాత్‌వే, పిల్లల ఆట వస్తువులు అమర్చాలని ఆదేశించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

27న కెరీర్ ఫెయిర్

పటమట, న్యూస్‌టుడే: ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పటమటలోని ఎన్‌ఎస్‌ఎం స్కూల్‌లో హైదరాబాద్ పీఏజీఈ అకాడమీ ఆధ్వర్యంలో కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌ఎస్‌ఎం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 12 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి దేశంలోని 36 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఆయా విశ్వవిద్యాలయాల్లో కోర్సులు, ఫీజులు, వివిధ సబ్జెక్టు కాంబినేషన్లు తదితర అంశాల గురించి విద్యావేత్తలు వివరిస్తారని, సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తాగునీటికి ఇబ్బందులే..!

లంబాడీపేటలోని సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతి గృహంలో ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ, బీటెక్, డిగ్రీ చదివే సుమారు 100 మంది విద్యార్థులు ఉన్నారు. వారికి ఈ ఏడాది దుప్పట్లు, మ్యాట్‌లు ప్రభుత్వం నుంచి అందలేదు. హాస్టల్లో మున్సిపల్ తాగునీరు ఉన్నప్పటికీ వాటిని విద్యార్థులు తాగడానికి అయిష్టత చూపుతున్నారు. దీంతో బయట నుంచి డబ్బాల ద్వారా శుద్ధజలాన్ని తెచ్చుకుంటున్నారు. అవి కూడా వసతి గృహ సంక్షేమాధికారి సమకూరుస్తున్నారు.

-న్యూస్‌టుడే, చిట్టినగర్



కేబీఎన్‌లో హెచ్ ఆర్ కాంక్లేవ్ నేడు

చిట్టినగర్, న్యూస్‌టుడే : కొత్తపేటలోని కేబీఎన్ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 26న హెచ్.ఆర్.కాంక్లేవ్ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ తెలిపారు. కళాశాల కమిటీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ప్రచార పత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కమిటీ సభ్యులు బాలకోటేశ్వరరావు, ప్రిన్సిపల్ కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార ప్రతులు ఆవిష్కరిస్తున్న తూనికుంట్ల తదితరులు

అమరావతికి రైల్వే లైన్ రాష్ట్రానికి భారీ ప్రోత్సాహం

పటమట, న్యూస్‌టుడే: అమరావతి రైల్వే లైనుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌లకు, దీని కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని ప్రాంతానికి దేశంలోని పలు ప్రాంతాలతో అనుసంధానం పెరిగేలా రూ. 2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వే లైనుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడం రాష్ట్రానికి భారీ ప్రోత్సాహమని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కృషి వల్లే ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

చిట్టినగర్, న్యూస్‌టుడే : కేంద్ర మంత్రివర్గం అమరావతి రాజధానికి రైల్వేలైను ఏర్పాటు చేసేందుకు ఆమోదించి రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమని భాజపా జిల్లా కోశాధికారి అవ్వారు బుల్లబ్బాయి అన్నారు. ఈ మేరకు శుక్రవారం 48వ డివిజన్ చిట్టినగర్ బస్టాప్ ఎదురుగా ఆ పార్టీ నాయకుడు దేవిన హరిప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న భాజపా నాయకులు

బాధితులను ఆదుకోవడం సామాజిక బాధ్యత



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

విద్యాధరపురం, న్యూస్‌టుడే : వరద బాధితులను ఆదుకోవడం సామాజిక బాధ్యతగా భావించాలని తెదేపా సీనియర్ నాయకుడు, కాళేశ్వరరావు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మైలవరపు కృష్ణ అన్నారు. కబేళా సెంటరు, రోటరీనగర్, ఆర్టీసీ వర్కు షాపు రోడ్డు ప్రాంతాల్లో బుడమేరు వరదల కారణంగా అవస్థలు పడిన కుటుంబాలకు నిత్యావసర వస్తువుల కిట్లను శుక్రవారం అందించారు. ఫినోలెక్సు ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఏపీ, తెలంగాణ హెడ్స్ సంకా శ్రీహరిరావు, ఎ.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సాయం అందించాలి

భవానీపురం, న్యూస్‌టుడే : పశ్చిమ నియోజకవర్గంలోని వరద బాధితులకు ప్రభుత్వ సాయాన్ని వెంటనే అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్.బాబూరావు పేర్కొన్నారు. వరద బాధితులకు సాయం అందించాలంటూ స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు సాయంపై దృష్టి సారించినప్పటికీ 50 శాతం మందికి సాయం అందలేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన బాధితులకు సాయం అందేలా చూడాలని కోరారు. సీపీఎం కార్పొరేటర్ బోయి సత్యబాబు, నాయకులు పాల్గొన్నారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాబూరావు తదితరులు

స్నేహితుడిపై మద్యం సీసాతో దాడి



గాయపడిన చరణ్‌సాయి

భవానీపురం, న్యూస్‌టుడే : మద్యం బాటిల్‌తో తల, మెడపై దాడి చేయడంతో ఓ యువకుడు గాయపడినట్లు భవానీపురం పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... భవానీపురానికి చెందిన గడ్డం చరణ్ సాయి, గొల్లపూడిలో నివాసం ఉండే గోవిందులు స్నేహితులు. చరణ్‌సాయి ఆటో డ్రైవర్‌గా, గోవిందు కాపాలాదారుగా పని చేస్తున్నారు. చరణ్‌సాయికి ఏడాది క్రితం వివాహమవ్వగా, ఆరు నెలల నుంచి భార్య షైనీప్రియతో విభేదాల కారణంగా విడిగా ఉంటున్నారు. ఈ నెల 25న మధ్యాహ్నం చరణ్‌సాయికి షైనీ ప్రియ ఫోన్ చేసి మాట్లాడాలని చెప్పింది. దీంతో సాయి ఆటోలో భార్యను ఎక్కించుకుని గొల్లపూడి వన్ సెంటర్ రోడ్డులో వెళ్తున్నాడు. అదే సమయంలో రహదారిపై ఉన్న గోవిందు మద్యం తాగి ఆటోను ఆపి సాయితో మాట్లాడుతున్నాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరగడంతో సాయి తల, మెడపై గోవిందు మద్యం బాటిల్‌తో కొట్టాడు. దీంతో సాయి తీవ్రంగా గాయపడ్డాడు. షైనీ ప్రియా అక్కడ నుంచి వెళ్లిపోయింది. గాయపడిన సాయిని స్నేహితుడైన ప్రవీణ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతున్నాడు. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కామన్ ఇంట్రెస్ట్ సంఘాల ఏర్పాటుపై సమీక్ష

విజయవాడ నగరపాలక సంస్థ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు సిద్ధం చేయాలని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ కుల్దీప్ నారాయణ్ అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కార్పొరేషన్ ముఖ్య అధికారులతో ఆయన సమావేశమై కామన్ ఇంట్రెస్ట్ గ్రూపుల ఏర్పాటుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... గ్రూపులు ఏర్పాటు చేస్తే. వాటిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. వాటికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాల్సి ఉందని చెప్పారు. కామన్ ఇంట్రెస్ట్ గ్రూపుల ఏర్పాటుకు విశాఖపట్నం, విజయవాడలను కేంద్రం ఎంపిక చేసిందని వెల్లడించారు. దీనిపై నవంబరు 1 నుంచి సర్వే చేయాల్సి ఉండగా, నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికే సర్వే చేసి 150 గ్రూపులను గుర్తించడం అభినందనీయమన్నారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

విజయవాడ మధ్య

కాలువ గట్ల సుందరీకరణ

విజయవాడ నగరపాలక సంస్థ: నగరంలోని కాలువ గట్ల వెంట వ్యర్థాలను పూర్తిగా తొలగించి సుందరంగా తీర్చిదిద్దాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. మధురానగర్ ప్రాంతంలోని కెనాల్ బండ్ ప్రాంతాన్ని అధికారులతో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ప్రధానంగా ఏలూరు కాలువ బండ్ ఆక్రమణలు గురించి కూడా చూడాలని, రెండువైపులా కంచె అమర్చి మొక్కలు నాటాలని అన్నారు. ప్రజల కోసం ప్రత్యేకంగా వాకింగ్ ట్రాక్, పాత్‌వే, పిల్లల ఆట వస్తువులు అమర్చాలని ఆదేశించారు. పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.

కామన్ ఇంట్రెస్ట్ సంఘాల ఏర్పాటుపై సమీక్ష

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కామన్ ఇంట్రెస్ట్ గ్రూపులు సిద్ధం చేయాలని మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ కుల్దీప్ నారాయణ్ అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కార్పొరేషన్ ముఖ్య అధికారులతో ఆయన సమావేశమై కామన్ ఇంట్రెస్ట్ గ్రూపుల ఏర్పాటుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ... గ్రూపులు ఏర్పాటు చేస్తే.. వాటిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటుందని అన్నారు. వాటికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం కల్పించాల్సి ఉందని చెప్పారు.

ఉత్సాహంగా ప్రతిభా పాటవ పోటీలు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్): అజిత్ సింగ్‌నగర్‌లోని శుభోదయ స్కూల్లో శుక్రవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రథమ బహుమతి ఆర్. ప్రణతి, ద్వితీయ బహుమతి ఎ.సిరిషా, తృతీయ బహుమతి ఎం.సితారా మ్ గెలుచుకున్నారు. అనంతరం వీరికి బహుమతులు అందించారు.



విజేతలతో ఉపాధ్యాయులు

చిన్నారుల సృజన వెలుగులోకి..

కస్తూరిబాయిపేట (సీతారాంపురం): 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతిభా పాటవ పోటీల్లో పలువురు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కస్తూరిబాయిపేటలోని నవోదయ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎం.డి.సుహానా ప్రథమ, ఎం.డి.ఆయేషా ద్వితీయ, పి.మౌనిక తృతీయ స్థానాల్లో గెలుపొందారు. విజేతలకు ప్రిన్సిపల్ ఎ.మాధవి బహుమతులు అందజేశారు.



విజేతలతో ప్రిన్సిపల్ ఎ.మాధవి

శిథిల భవనం.. వసతులు పూజ్యం

అందని దుప్పట్లు.. తప్పని బాధలు | **వసతి గృహ విద్యార్థులు విలవిల**

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే

పాయకాపురంలోని బాలుర సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహంలో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. పాత కాలం నాటి భవనం శిథిలావస్థకు చేరింది. గోడలన్నీ బీటలు వారాయి. ఇటీవల బుడమేరుకు వచ్చిన వరదలతో ఆరు అడుగుల మేర వరద వచ్చింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో కిటికీలు, తలుపులన్నీ పాడైపోయాయి. ముగురు వాసన వెదజల్లుతోంది. పాడువడిన బంగ్లాను తలపిస్తోంది. కొన్ని చోట్ల స్లాబ్ పెచ్చులు పట్టి ఇనుప చువ్వలు బయటపడ్డాయి. విద్యార్థులకు సరిపడా బాత్‌రూమ్‌లు లేవు. ఉన్న వాటిలోనే సర్దిపెట్టుకుంటున్నారు. ఇటీవల వరదలకు పాడైపోగా.. అధికారులు నామమాత్రంగా మరమ్మతులు చేశారు. పక్కనే డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ ఉండటంతో ముక్కుపుటాలదిరే దుర్వాసనతో వసతిగృహంలో ఉండలేని పరిస్థితి నెలకొంది.



శిథిలావస్థకు చేరిన భవనం



స్లాబ్ పాడైపోయి చువ్వలు బయటపడ్డాయిలా...

అద్దాలు లేవు. చలికాలం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. పది గదులకు, తలుపులకు దోమల మెష్ లేకపోవడంతో రాత్రి వేళ దోమలు వచ్చేస్తున్నాయి. దోమకాటుతో నిద్రలేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఏటా జులై నెలలో దుప్పట్లు ఇస్తే వారు.. ఈ ఏడాది అక్టోబరు నెల పూర్తవుతున్నా... ఇప్పటికీ ఇవ్వలేదు. గత ప్రభుత్వ హయాంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్త ప్రభుత్వంలో మార్పు వచ్చి సౌకర్యాలు మెరుగుపడతాయని అందరూ ఆశిస్తున్నారు.



పాడైపోయిన అద్దాలు.. కిటికీలు

దోమలతో ఇబ్బందులు


వసతిగృహంలో 87 మంది విద్యార్థులు ఉంటున్నారు. మొత్తం పది గదులున్నాయి. కిటికీలకు దోమల మెష్ ఉన్నా..

బయోమెట్రిక్ పడక...

వసతిగృహంలో ఉన్న బయోమెట్రిక్ యంత్రం పాతది. విద్యార్థుల వేలిముద్ర పడితేనే మెస్ ఛార్జీలు వస్తాయి. ఒక్కొక్కరికి రోజుకు రూ.52లు మేర చెల్లిస్తారు. హాజరు నమోదుకాకపోవడంతో.. నెలకు రూ.12వేల వరకు మెస్ బిల్లులు రాక వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారు. మిగిలిన వసతిగృహాల్లో మాన్యువల్‌గా నమోదు చేసే అవకాశం ఉంది. కానీ ఇక్కడ మాత్రం ఆ సౌకర్యం లేకపోవడంతో వార్డెనుకు ఇబ్బందులు తప్పటం లేదు.

ఇంటి దుప్పట్లే గతి..!

కస్తూరిబాయి పేట (సీతారాంపురం), న్యూస్‌టుడే : కస్తూరిబాయి పేటలో సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం ఉంది. అయిదో తరగతి నుంచి పదో తరగతి విద్యనభ్యసించే విద్యార్థినులు సుమారు 144 మంది చదువుకుంటున్నారు. వీరంతా సమీపంలోని బిషప్ అజరయ్యా బాలికోన్నత పాఠశాల, ఎలిమెంటరీ పాఠశాల, కర్నాటి రామ్మోహనరావు నగరపాలక సంస్థ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తుంటారు. వీరందరికీ ఇప్పటికీ ఎలాంటి దుప్పట్లు పంపిణీ చేయలేదు. చేసేదిలేక ఇంటి నుంచి తెచ్చుకుని వినియోగించుకుంటున్నారు. మరుగుదొడ్లు సరిపడా లేవు. వీటితోపాటు మంచి నీటి మోటర్ రిపేరులో ఉంది. డైనింగ్ హాలులో టీవీ పనిచేయడం లేదు. చిన్న చిన్న పనులు చేయకపోవడంతో.. బాలికలు ఇబ్బంది పడుతున్నారు.



మరుగుదొడ్లకు మరమ్మతులు అవసరం

30న మహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : ఇంద్రకీలాద్రిపై ఈ నెల 30న మహాలక్ష్మి యాగాన్ని నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వైదిక కమిటీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. నూతన యాగశాలలో ఉదయం 8 గంటలకు రుద్ర హోమం పూర్తయిన తర్వాత ఈ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యాగంలో పాల్గొన దలచిన ఉభయ దాతలకు టిక్కెటు రుసుము రూ.1000గా నిర్ణయించినట్లు తెలిపారు.

క్రీడాభివృద్ధికి సహకరించరూ..!

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి శాప్ కృషి చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) డిమాండ్ చేసింది. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వై.రాము, జి.రామన్నలు శుక్రవారం స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని కార్యాలయంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడుని కలిసి వినతి పత్రం సమర్పించారు. శాప్‌ను ప్రక్షాళన చేయాలని కోరారు. ప్లే అండ్ ప్లే విధానాన్ని రద్దు చేయాలని, రెగ్యులర్ కోచ్‌ల నియామకాలు చేపట్టాలని, ఒప్పంద కోచ్‌లను క్రమబద్ధీకరించాలని, పొరుగు సేవల ద్వారా పనిచేస్తున్న 97 మంది శిక్షకులకు మినిమమ్ టైమ్ స్కేల్ ద్వారా వేతనాలిచ్చి రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. క్రీడా మైదానాలను కాపాడాలని, అకాడమీలు, వసతి గృహాలు ఏర్పాటు చేయాలని కోరారు.

తెదేపా సభ్యత్వాల లక్ష్యం.. 75వేలు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లలో శనివారం నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం తెదేపా సెంట్రల్ కార్యాలయంలో 2024-26 వరకు సభ్యత్వ నమోదుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. బొండా మాట్లాడుతూ.. శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొదటి రెన్యువల్ సభ్యత్వాన్ని నమోదు చేసుకుని, ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సెంట్రల్‌లో గతంలో 50 వేల సభ్యత్వం ఉందని, ఈ సారి 75 వేల సభ్యత్వాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. తెదేపా సభ్యత్వం కలిగి ఉండడం. . ప్రజలు గౌరవంగా భావిస్తున్నారని తెలిపారు. ప్రతి రెండేళ్లకు సభ్యత్వ నమోదు, ఏటా మహానాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. పైపులరోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెల్లడించారు. రూ.100ల సభ్యత్వ రుసుమును ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా మాత్రమే తీసుకుంటామని చెప్పారు. సభ్యులు మరణిస్తే మట్టి ఖర్చుల కింద రూ.10వేలు, ప్రమాదంలో మరణిస్తే బీమా ద్వారా రూ.5లక్షలు పార్టీ అందిస్తుందని తెలిపారు. నాయకులు నవనీతం సాంబశివరావు, వల్లభనేని సతీష్, గంటా కృష్ణమోహన్, ఎరుబోతు రమణారావు, శ్రీనివాస్, ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమామహేశ్వరరావు

27న కెరీర్ ఫెయిర్

పటమట, న్యూస్‌టుడే: ఈ నెల 27వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పటమటలోని ఎన్ఎస్ఎం స్కూల్‌లో హైదరాబాద్ పీఏజీఈ అకాడమీ ఆధ్వర్యంలో కెరీర్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్ఎం ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10 నుంచి 12 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి దేశంలోని 36 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఆయా విశ్వవిద్యాలయాల్లో కోర్సులు, ఫీజులు, వివిధ సబ్జెక్టు కాంబినేషన్లు తదితర అంశాల గురించి విద్యావేత్తలు వివరిస్తారని, సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఎస్ఎన్ఎల్ పింఛనర్లకు చేయూత

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : పింఛనుదారుల సమస్యల పరిష్కారానికి బీఎస్ఎన్ఎల్ ఎప్పుడూ కృషి చేస్తుందని ఆ సంస్థ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇటీవల వరదల్లో నష్టపోయిన సంస్థ పింఛనుదారులకు బి.ఎస్.ఎన్.ఎల్. పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని గుజ్జుల సరళాదేవి కల్యాణ మండపంలో ఆర్థికసాయం అందించారు. 85 మందికి ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ తరపున వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరిస్తామని తెలిపారు. వరదలు, వర్షాలతో తీవ్రంగా నష్టపోయినా ఇతర సంస్థల కన్నా ముందుగా బి.ఎస్.ఎన్.ఎల్. ఇంటర్నెట్, ఫోన్ సేవలను పునరుద్ధరించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ డీజీఎం ఉమామహేశ్వరరావు, ఏజీఎం పోతురాజు నారాయణాచారి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎస్.కోటేశ్వరరావు, డి.వెంకటేశ్వరరావు, కె.పూర్ణచంద్రరావు, సి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న జీఎం శ్రీనివాస్

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

63036 11232

? కండ్రిక వాటర్ ట్యాంకు రోడ్డులో కుక్కలు గుంపులు గుంపులుగా వెంటబడి కరుస్తున్నాయి. రోడ్డుమీదకు రావాలంటే భయమేస్తోంది. - కాళీ సరస్వతి, స్థానికురాలు

✔ వీధి కుక్కలకు వ్యాక్సిన్ వేయిస్తాం. - డాక్టర్ సోమశేఖరరెడ్డి, వీఏఎస్, వీఎంసీ – న్యూస్‌టుడే, సీతారాంపురం

లెనిన్‌కూడలిలో దుకాణాల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది



లెనిన్ విగ్రహం పార్కు పక్కన దుకాణాలు తొలగించి ఖాళీ చేశారిలా..

స్పందనకు వందనం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : లెనిన్ కూడలిలో హాకర్లు, తోపుడు బండ్లను శుక్రవారం తెల్లవారుజామున పోలీసు బందోబస్తు నడుమ పట్టణ ప్రణాళికాధికారులు తొలగించారు. లెనిన్ విగ్రహం ఉన్న పార్కుకు అనుకుని తోపుడుబండ్ల వ్యాపారం నిర్వహిస్తున్నారు. కూడలి మొత్తం బండ్లు పెట్టడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. ఇక్కడే ఆటోలను ఆపుతుండటంతో నడిచేందుకు వీలు లేకుండా పోయింది. వీటిపై పలు ఫిర్యాదులు రావడంతో పాటు ప్రజలు పడుతున్న ఇబ్బందులపై 'ఈనాడు'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై నగరపాలకసంస్థ అధికారులు స్పందించారు. శుక్రవారం జేసీబీలు, ట్రాక్టర్లతో వచ్చి బండ్లు, బల్లలను పూర్తిగా తొలగించి తరలించేశారు. విజయ డెయిరీ పార్లర్‌కు సమీపంలో ఉన్న దుకాణాలను సైతం తీసివేశారు. జేసీబీలతో తవ్వి ఆయా ప్రాంతాల్లో ఉన్న మట్టి ఇతర వ్యర్థాలను తీయించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చేశారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

హాకర్ల తొలగింపుపై నిరసనలు



దుర్గారావు, నరసింహారావు తదితరుల ధర్నా

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : లెనిన్‌కూడలిలో హాకర్ల తొలగింపుపై సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ధర్నా చేశారు. గత 35 సంవత్సరాలుగా ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటున్నారని, వారికి చెప్పకుండా జేసీబీలతో తొలగించి రోడ్లపై పడవేశారని వాపోయారు. వ్యాపారాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. వీరికి సీపీఎం నాయకులు దోనేపూడి కాశీనాథ్, కె.దుర్గారావు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు మద్దతు తెలిపారు. అనంతరం వ్యాపారులు తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే బండ్లు, హాకర్లను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలస్వామి మాట్లాడుతూ.. గవర్నర్‌పేటలో ఎక్కడ ఆక్రమణలు తొలగించినా తనకు ముడిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాకర్ల తొలగింపు వెనుక నా హస్తం ఉందని ఆరోపించే వారు.. నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. దుకాణాల తొలగింపుపై అధికారులతో మాట్లాడతానని వారికి హామీ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

మధురానగర్: మధురానగర్‌లో ఏలూరు కాలువ గట్టుపై దేవాలయాల పేరిట వెలిసిన నిర్మాణాలు, గోశాలను కూల్చి వేయడంపై మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మధురానగర్‌కు విచ్చేసి స్థానికులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో గుడులు, గోవులకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వ హయాంలోనే ఫెన్సింగ్ పనులు ప్రారంభించామని తెలిపారు.

రాజకీయ జోక్యంపై స్థానికుల పెదవి విరుపు

ఏలూరుకాలువ గట్టు ఆక్రమణల తొలగింపును కేవలం 10 మంది తప్ప మధురానగర్‌వాసులంతా హర్షిస్తుంటే.. ఈ విషయంలో రాజకీయ జోక్యం ఏంటని స్థానికులు పెదవి విరుస్తున్నారు. తాము ఇక్కడ వాకింగ్ ట్రాక్ కావాలని ఎప్పటి నుంచో అడుగుతున్నా.. గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మూడు నెలల క్రితం మధురానగర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు బి.ఆర్.టి.ఎస్. రోడ్డుకు వాకింగ్‌కు వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో మరణించారని గుర్తు చేశారు. ఇక్కడే వాకింగ్ ట్రాక్ ఉంటే. . ప్రయోజనకరంగా ఉంటుందన్నారు.

అమరావతి రైల్వే లైన్ రాష్ట్రానికి భారీ ప్రోత్సాహం

పటమట, న్యూస్‌టుడే: అమరావతి రైల్వే లైనుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్‌లకు, దీని కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎంపీ కేశినేని శివనాథ్ శుక్రవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని ప్రాంతానికి దేశంలోని పలు ప్రాంతాలతో అనుసంధానం పెరిగేలా రూ.2,245 కోట్లతో 57 కి.మీ. రైల్వే లైనుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడం రాష్ట్రానికి భారీ ప్రోత్సాహమని అన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు కృషి వల్లే ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

గవర్నర్‌పేట, మధురానగర్: విద్యుత్తు లైన్ల తనిఖీలు, మరమ్మతుల కారణంగా గవర్నర్‌పేట, అజిత్‌సింగ్‌నగర్, మధురానగర్ విద్యుత్తు సెక్షన్ల పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.రవీంద్రబాబు తెలిపారు. గవర్నర్‌పేట పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు మ్యూజియం రోడ్డు, దుర్గయ్యవీధి, కాళేశ్వరరావురోడ్డు, మల్లాది వారి వీధి, కారల్‌మార్క్స్‌రోడ్డులో విద్యుత్తు ఉండదు. మధురానగర్ సెక్షన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బి.ఆర్.టి.ఎస్.రోడ్డు, పున్నయ్యకాలనీ, గులాబీతోట, దేవీనగర్, రామకృష్ణాపురం, పసుపుతోట, సాయిబాబాకాలనీ, కొబ్బరితోట, లెక్చరర్స్‌కాలనీ, నేతాజీకాలనీ, పప్పులమిల్లు ప్రాంతంలో సరఫరా నిలిపివేస్తారు. అజిత్‌సింగ్‌నగర్ సెక్షన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు తోటవారి వీధి, వైఎస్సార్ రోడ్డు, సిద్ధార్థ వీధి, హనుమంతరావు వీధి, వినాయకకాలనీ, భరతమాత కాలనీ, ఉప్పలపాటి సీతారామరాజు వీధి, ఆర్‌అండ్‌బీ కాలనీ తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదని ఈఈ వివరించారు.

గాంధీనగర్ సెక్షన్ పరిధిలో..

గాంధీనగర్, న్యూస్‌టుడే : గాంధీనగర్ సెక్షన్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ పి.రవీంద్రబాబు తెలిపారు. ఆంధ్రరత్న రోడ్డు, ఎన్ఆర్‌పీ రోడ్డు, నర్రా వారి వీధి, రైల్వేస్టేషన్ రోడ్డు, మల్లికార్జున వీధి, అలంకార్ సెంటర్, పాపయ్య వీధి, వీఎంసీ వాటర్ ట్యాంకు, సన్యాసిరాజు వీధి, ప్రెస్ క్లబ్ ప్రాంతాల్లో విద్యుత్తు నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్): భారత మహిళామండలి సభ్యురాలు విజయశ్రీ మనువడు హిత్విక్ ధీర్ పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ ఎంకే బేగ్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. మహిళామండలి అధ్యక్షురాలు ఆర్.శ్రీలక్ష్మిదేవి, కామేశ్వరి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇమామ్‌బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

27న డయాబ్ ఎండోకాన్ సదస్సు



ఆహ్వానపత్రిక ఆవిష్కరిస్తున్న వైద్యులు సదాశివరావు, అమూల్య, హిమన, ఐశ్వర్య

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : యలమంచి డయాబెటిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న 'డయాబ్ ఎండోకాన్ 2024' వైద్య సదస్సు నిర్వహిస్తున్నట్లు యలమంచి డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్, మధుమేహ వైద్య నిపుణుడు యలమంచి సదాశివరావు తెలిపారు. శుక్రవారం సూర్యారావుపేటలోని ఆ ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏటా డయాబెటిస్ సదస్సు నిర్వహిస్తున్నామని.. ఈ ఏడాది ఎండోక్రినాలజీ విభాగాన్ని జతచేసి డయాబ్ ఎండో కాన్ 2024కు రూపకల్పన చేసినట్లు వివరించారు. లబ్బీపేటలోని జి.ఆర్.టి. గ్రాండ్ హోటల్‌లో నిర్వహించే సదస్సుకు 25 మంది నిష్ణాతులైన వైద్య ప్రముఖులు వివిధ అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. ఆధునిక చికిత్సలు, నవీన ఆవిష్కరణలు తెలుసుకోవచ్చన్నారు. ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ కృష్ణశేషాద్రికి బంగారుపతకం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఫౌండేషన్ ట్రస్టీ డాక్టర్ హిమన, కార్యదర్శి డాక్టర్ ఐశ్వర్య, సంయుక్త కార్యదర్శి డాక్టర్ అమూల్య పాల్గొన్నారు.

గాయకుడు భరత్ మృతికి సంతాపం

గాంధీనగర్, న్యూస్‌టుడే : బాల గాయకుడు పూదోట భరత్ అకాల మృతికి తీరని లోటని పలువురు కళాకారులు, గాయకులు పేర్కొన్నారు. శుక్రవారం కౌతా కళావేదికపై సంతాప సభ నిర్వహించారు. భరత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రి కళాపీఠం అధ్యక్షురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ.. సీనియర్ గాయని అమరారాణి కుమారుడైన భరత్ ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారని గుర్తు చేశారు. చావా నరసింహారావు, కె.డేవిడ్‌రాజు, సత్యవర్ధన్, రసూల్‌బాబు, శ్యామ్‌ప్రసాద్, గుర్రం శ్రీనివాసరావు, చలపతిరావు, దామోదర గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

పాయకాపురం (మధురానగర్), న్యూస్‌టుడే : మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో వాస్తు హౌసింగ్ ఫైనాన్స్, భారత్ కేర్స్ ఆధ్వర్యంలో 160 మంది మహిళలకు పరిశ్రమల స్థాపనపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి కండ్రికలోని కేర్ అండ్ షేర్ సెంటరులో శనివారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కండ్రిక, కృష్ణలంక, క్రీస్తురాజపురం తదితర ప్రాంతాలకు చెందిన మహిళలకు వ్యవస్థాపక అభివృద్ధి, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతలో శిక్షణ ఇచ్చారు. వ్యాపార స్థాపన, అభివృద్ధి, కార్యకలాపాల నిర్వహణపై అవగాహన కల్పించారు. నిర్వాహకులు పూజా భారతి, ఆశీష్ త్రిపాఠి, చిరంజీవి తదితరులు మాట్లాడారు. కొత్త వ్యాపారం ప్రారంభించేందుకు అవసరమైన మెటీరియల్ సమకూరుస్తామని తెలిపారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రీజనల్ డైరెక్టర్ అజంతా కుమార్ మాట్లాడుతూ.. ఇక్కడ పెంపొందించుకున్న నైపుణ్యాలతో మంచి భవిష్యత్తును ఏర్పరుచుకోవాలని మహిళలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నున్న ఎస్సై విమల, వీఆర్వో శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి తదితరులు పాల్గొన్నారు.



ధ్రువీకరణ పత్రాలు పొందిన వారితో నిర్వాహకులు

ఉచిత ఇసుక హామీ అమలుకు డిమాండ్

మధురానగర్, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి నరసింహారావు డిమాండ్ చేశారు. శుక్రవారం బి.ఆర్.టి.ఎస్.రోడ్డులోని ఎన్‌పీఆర్ భవనంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు ఉచిత ఇసుక సరఫరా చేయాలని కోరారు. జిల్లాలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని ఇసుక క్వారీలను తెరిచి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణ రంగ కార్మికుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు ఉపాధి చూపించాలని కోరారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత సింగ్‌నగర్ క్లబ్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక ఐజీఎంసీ స్టేడియంలో రెండు రోజుల పాటు జరుగుతున్న జేవియర్ రాష్ట్ర స్థాయి ఓపెన్ ఫుట్‌బాల్ టోర్నీలో సింగ్‌నగర్ ఫుట్‌బాల్ క్లబ్ అండర్-18 కేటగిరీలో విన్నర్ ట్రోఫీ కైవసం చేసుకుంది. శుక్రవారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ఇరు జట్లు చెరో రెండేసి గోల్స్ సాధించాయి. చీకటి పడడంతో ఇరుజట్లకు టాస్ వేసి విజేతను నిర్ణయించారు. దీనిలో సింగ్‌నగర్ ఎఫ్‌సీ జట్టు టాస్ గెలుచుకుంది. అండర్-15 కేటగిరీ ఫైనల్ మ్యాచ్‌లో హంటింగ్ టైగర్స్ జట్టు 1-0 గోల్స్ తేడాతో జేవియర్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టుపై గెలుపొందింది. ముగింపు కార్యక్రమానికి కర్రె సుధాకర్ హాజరై విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వై.శేషగిరిరావు, జేవియర్ ఫుట్‌బాల్ క్లబ్ అధ్యక్షుడు వి.శామ్యూల్ రత్నం, కార్యదర్శి బి.చక్రవర్తి, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పశుగణనతో కచ్చితమైన వివరాలు

అజిత్‌సింగ్‌నగర్ (మధురానగర్), న్యూస్‌టుడే : దేశవ్యాప్తంగా పశుగణన జరుగుతోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు చెప్పారు. దీని ద్వారా రాష్ట్రంలో కచ్చితమైన పశుసంపద వివరాలు తెలుస్తాయన్నారు. శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్‌లోని తెదేపా సెంట్రల్ కార్యాలయంలో 21వ జాతీయ పశుగణన గోడపత్రిక ఆవిష్కరించారు. సిబ్బందికి గణన కిట్లు అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గణన ద్వారా ఎన్ని ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు ఉన్నాయో తెలుస్తుందన్నారు. పాల ఉత్పత్తి, పాడి పశువుల సంఖ్య తెలుసుకుని.. ఉత్పత్తిని అంచనా వేయవచ్చని వివరించారు. జిల్లాలో 241 మంది పశు గణన అధికారులు, 47 మంది పర్యవేక్షకులను నియమించారు. వీరు 7.02లక్షల కుటుంబాలను సందర్శించి 16 రకాల పశువుల సంఖ్యను లెక్కిస్తారని ఆయన చెప్పారు. దీనికి ముందు ఎమ్మెల్యే ఇంటి నుంచి గణన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు ఎం.హనుమంతరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరిగేదెలా... కదిలేదెలా?!



బెంజిసర్కిల్ నుంచి బందరు రోడ్డులో మార్గ్ క్రిష్ణాయ దగ్గర యూ టర్న్ తీసుకునే వాహనాలు ఒకవైపు.. మరో వైపు ఎన్టీఆర్ కూడలి దగ్గర యూ టర్న్ లేక మార్గ్ క్రిష్ణాయ దగ్గరే మలుపు తీసుకునేవి ఇంకోవైపు... వెరసి బందర్‌రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మలుపు తిరిగే వాహనచోదకులు తాము త్వరగా వెళ్లాలని వాహనం అడ్డుగా తెస్తుంటే.. మేమే ముందు వెళ్లాలని బందర్‌రోడ్డులో వారు దూసుకొస్తున్నారు. ఇలా వీరు వెళ్లక.. వారు వెళ్లడానికి ఇబ్బంది ఏర్పడి ఏకంగా ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం స్కూళ్లు, ఆఫీసులకు వెళ్లి వచ్చేటప్పుడు తీవ్ర ట్రాఫిక్‌తో చోదకులు తల్లడిల్లుతున్నారు. కనీసం ఆ వేళలోనైనా ఎన్టీఆర్ కూడలిలో వాహనాలు మలుపు తిరిగే ఏర్పాట్లు చేసి కష్టాలు తీర్చాలని చోదకులు కోరుతున్నారు. - ఈనాడు, అమరావతి

అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

భాజపా ఏపీ అధ్యక్షురాలు

భవానీపురం, న్యూస్‌టుడే : అమరావతి రాజధాని నిర్మాణానికి భాజపా కట్టుబడి ఉందని, ఆ ప్రకారం అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. అమరావతి రైల్వేలైన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేయడంతో శుక్రవారం విజయవాడలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయం వద్ద నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ అమరావతికి రూ.2,245 కోట్ల వ్యయంతో నూతన రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపినట్లు చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఈ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అకాల వర్షాలు, పర్యావరణ మార్పులతో ఇబ్బందులు పడుతున్నామని, అడవులను పాడు చేయకుండా దీని నిర్మాణం జరుగుతుందన్నారు. విశాఖ రైల్వేజోన్ నిర్మాణానికి గత ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం స్థలం మంజూరుకు సిద్ధంగా ఉందని వెల్లడించారు. నాలుగు నెలల్లో రైల్వేజోన్ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందిస్తుందని, అందులో భాగంగా 57 కి.మీ రైల్వేలైన్‌ను మంజూరు చేసిందన్నారు. జాతీయ రహదారుల నిర్మాణం పెద్దఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం బాణాసంచా కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. శివన్నారాయణ, యామిని శర్మ, వెంకట సత్యనారాయణ, పాతూరి నాగభూషణం, షేక్.బాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పురందేశ్వరి

కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కీలకం!

- సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి
- ఆయకట్టుదారుల గుర్తింపు ప్రారంభం
- నవంబరు 21న ఎన్నికల నిర్వహణ

ఈనాడు – అమరావతి

"సుదీర్ఘ కాలం తర్వాత ఉమ్మడి కృష్ణాలో సాగునీటి సంఘాల ఎన్నికల హడావుడి ప్రారంభమైంది. అయిదేళ్లుగా సాగునీటి సంఘాల ఎన్నికల ఊసే లేదు. ప్రస్తుతం నీటి వినియోగదారుల సంఘాలు, పంపిణీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ల ఎన్నికల తర్వాత రాష్ట్రస్థాయి అపెక్సు కమిటీ ప్రాధాన్యం సంతరించుకోనుంది. నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటైతే.. బాధ్యతాయుతంగా సాగునీటిని వినియోగించి దుర్వినియోగం అరికట్టే వీలుంది. జగన్ ఏలుబడిలో వీటిని విస్మరించగా అధికారులే నడిపించారు. ఉమ్మడి జిల్లాలో మూడు ప్రాజెక్టు కమిటీలు ఏర్పాటు కావాలి. ప్రధానంగా నీటి పంపిణీ, కాలువల నిర్వహణ, మరమ్మతులు తదితర బాధ్యతలు నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగించే వీలుంది. గతంలో తెదేపా ప్రభుత్వం నీటి వినియోగదారుల సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వగా క్రియాశీలకంగా నడిచాయి."

అత్యంత ప్రతిష్ఠాత్మకం..

★ జిల్లాలో తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఎన్నిక ప్రతిష్ఠాత్మకంగా మారనుంది. దీని కింద ప్రధానంగా ఏలూరు కాలువ, బందరు కాలువ, రైవస్ కాలువలు ఉన్నాయి. కృష్ణా, ఏలూరు జిల్లాల్లోనూ ఆయకట్టు ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ గ్రామీణంలోనే ఉంది. ముందుగా ఆయకట్టు రైతుల గుర్తింపు చేపట్టారు. జలవనరుల శాఖ అధికారులు ఆయకట్టుదారుల జాబితా తయారు చేసి.. వచ్చే నెల 13న తుది జాబితా ప్రకటిస్తారు. ముందుగా అభ్యంతరాలు స్వీకరించి ఆర్డీవో ఆధ్వర్యంలో పరిష్కరిస్తారు. ప్రతి పంపిణీ కమిటీ కింద 5-12 నీటి వినియోగదారుల సంఘాలు ఉంటాయి. నీటి వినియోగదారుల సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఒక కమిటీ ఏర్పాటవుతుంది. దీనికి రాజకీయంగా ప్రాధాన్యం ఉంది. వచ్చే నెల 24న పంపిణీ కమిటీలను ఎన్నుకుంటారు. తర్వాత నవంబరు 27న ప్రాజెక్టు కమిటీలను ఎన్నుకుంటారు.

అపెక్సు కమిటీలో ప్రాధాన్యం..

★ అపెక్సు కమిటీలో కృష్ణా జిల్లా తూర్పు డెల్టా నుంచి తప్పక ప్రాధాన్యం ఉంటుంది. రాష్ట్రంలో ఇది కీలకంగా మారనుంది. ఈసారి ఎలాంటి ప్రాధాన్యం దక్కుతుందనే దానిపై చర్చ సాగుతోంది. గతంలో అపెక్సు కమిటీ సభ్యునిగా ఆళ్ల గోపాలకృష్ణ (గన్నవరం) వ్యవహరించారు. ఆయన సాగునీటి సంఘాల సమాఖ్య అధ్యక్షుడిగా ఉన్నారు.



బందరు కాలువ

నేరుగా కమిటీ పరిధిలోనే..

★ ఉమ్మడి కృష్ణాలో మూడో ప్రాజెక్టు కమిటీ మధ్యతరహా, చిన్న నీటి పారుదలకు కేటాయించారు. పెనుగంచిప్రోలులో మున్నేరు వాగుపై ఒక ఆనకట్ట ఉంది. మున్నేరు, తమ్మిలేరు కలిపి ఈ ప్రాజెక్టు కమిటీ ఉంది. దీని పరిధిలో రెండు మాత్రమే డీసీ కమిటీలు ఉన్నాయి. చిన్న నీటి పారుదలకు ప్రతి 100 ఎకరాలు ఉన్న ఆయకట్టు చెరువు కింద నీటి వినియోగదారుల సంఘం ఏర్పాటు చేయాలి. వీటికి పంపిణీ కమిటీలు లేవు. నేరుగా ప్రాజెక్టు కమిటీ పరిధిలో ఉంటారు. వత్సవాయి, నందిగామ, పెనుగంచిప్రోలు మండలాలతో పాటు తమ్మిలేరు కింద చాట్రాయి మండలం దీని పరిధిలో చేర్చారు. చిన్న నీటి పారుదల కింద దాదాపు 212 నీటి వినియోగదారుల సంఘాలు ఏర్పాటు కానున్నాయి.

శివారుకు నీరందేలా...

★ఎన్టీఆర్ ఆయకట్టుకు ఒక ప్రాజెక్టు కమిటీ జిల్లాకు కేటాయించారు. జోన్ 2, జోన్ 3 పరిధిలో నూజివీడు, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట, నందిగామ ఉన్నాయి. కానీ ఎన్టీఆర్ ఎడమ కాలువ ప్రాజెక్టు పరిధిలో జోన్2, జోన్ 3లోకు శివారు నీరు రావడం లేదు. జగ్గయ్యపేట, నూజివీడు సబ్ జోన్లకు పూర్తిగా నీరందని పరిస్థితి. దీనికి ప్రాజెక్టు కమిటీ ఎన్నుకోనున్నారు. 106 సాగునీటి వినియోగదారుల సంఘాలు, 17 డీసీలు ఉన్నాయి. శివారుకు నీరుదేలా మరింత చొరవచూపే వీలుంది.

ఉమ్మడి జిల్లాలో కమిటీల తీరు

ప్రాజెక్టు కమిటీలు	: 03
తూర్పు డెల్టా..	
పంపిణీ కమిటీలు	: 32
సాగునీటి సంఘాలు	: 222
ఆయకట్టు: 7.39 లక్షల ఎకరాలు	
నాగార్జునసాగర్ ఎడమ కాలువ	
(జోన్ 2, జోన్ 3)	
పంపిణీ కమిటీలు (డీసీలు)	: 17
సాగునీటి సంఘాలు	: 106
ఆయకట్టు : 3.62 లక్షల ఎకరాలు	
మధ్యతరహా, చిన్న నీటి తరహా (మున్నేరు)	
పంపిణీ కమిటీలు (డీసీ)	: 02
సాగునీటి సంఘాలు	: 151
ఆయకట్టు: మున్నేరు, తమ్మిలేరు: 2,131 ఎకరాలు,	
ప్రతి 100 ఎకరాలు ఉన్న చెరువులు	

ఏపీ జీఎన్‌ఏ రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నిక నేడు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నర్సుల అసోసియేషన్ (ఏపీ జీఎన్‌ఏ) ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల 26వ తేదీ శనివారం ఆ సంఘం రాష్ట్ర ఆఫీస్ బేరర్ల ఎన్నిక ఉంటుందని ఎన్నికల నిర్వహణాధికారి ఎస్.శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సంఘం బైలాస్, ఏపీ సీఎస్ (ఆర్ఓఎస్ఏ) నిబంధనల 2001 ప్రకారం అత్యంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మహాత్మా గాంధీ రోడ్డులోని కృష్ణాజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో ఉదయం సమావేశం ఉంటుందని తెలిపారు. ఎన్నికైన జిల్లా యూనిట్ల ఆఫీస్ బేరర్లు హాజరు కావాలని ఆయన సూచించారు. సంబంధిత జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసిన ఒరిజినల్ డిక్లరేషన్ ఫారం (ఫారం 12)తో పాటు ఫొటో గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

త్వరితగతిన బీమా క్లెయిమ్‌ల పరిష్కారం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వరద ప్రభావిత ప్రాంత ప్రజల వాహనాలు, వివిధ ఆస్తి నష్టాలకు సంబంధించి బీమా క్లెయిమ్‌ల పరిష్కారంలో బీమా సంస్థల కృషి ప్రశంసనీయమని, పెండింగులో ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా సూచించారు. నగరంలోని కలెక్టరేట్‌లో రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హాతో కలిసి, వివిధ బీమా సంస్థల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బీమా సంస్థల వారీగా నమోదైన, పరిష్కరించిన, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లపై చర్చించారు. 12,632 మోటార్ వాహనాలు, 2,794 ఆస్తులకు సంబంధించి మొత్తం 15,426 క్లెయిమ్‌లు నమోదవగా, 605 ఉపసంహరణ, 325 తిరస్కరణకు గురైనట్టు పేర్కొన్నారు. మిగతా 14,496 క్లెయిమ్‌ల్లో ఆన్ అకౌంట్, అండర్ ఆక్షన్‌తో సహా 97.16 శాతం మేర సెటిల్‌మెంట్ చేసినట్టు రవాణా శాఖ అధికారులు వివరించారు. మొత్తం రూ.136.52 కోట్ల మేర చెల్లింపులు చేసినట్టు వెల్లడించారు. సిసోడియా మాట్లాడుతూ. . క్లెయిమ్‌ల పరిష్కారంపై సీఎం చంద్రబాబు మొదటి నుంచి ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు తెలిపారు. బీమా సంస్థలు మెరుగైన పనితీరు కనబరిచినట్టు పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో పెండింగులో ఉన్న ద్విచక్ర, తిచక్ర, ప్రైవేటు కార్లు, ట్యాక్సీలు, వాణిజ్య వాహనాలతో పాటు, కుటుంబాలు, దుకాణాలు, ఎస్.ఎం.ఇ, ఎం.ఎస్.ఎం.ఇ. ఆస్తుల నష్టాలకు సంబంధించిన క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ డీటీసీ సి.హెచ్.మోహన్, డీటీసీ (ఐటీ) ఎం.పురేంద్ర, బీమా కంపెనీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, పక్కనే మనీష్ కుమార్, హాజరైన బీమా సంస్థల ప్రతినిధులు, అధికారులు

టిప్పర్ లారీ క్యాబిన్ దగ్ధం

భవానీపురం, న్యూస్‌టుడే : విద్యాధరపురం సితార సెంటర్ రోడ్డులో శుక్రవారం ఉదయం టిప్పర్ లారీ క్యాబిన్‌లో నుంచి మంటలు రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. వివరాలిలా ఉన్నాయి... మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి సంబంధించి రాళ్లను కంచికచర్ల నుంచి టిప్పర్‌లో వేసుకుని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో సితార సెంటర్ వద్దకు వచ్చే సరికి లారీ క్యాబిన్‌లో నుంచి మంటలు వస్తున్నాయి. దీంతో డ్రైవర్ రామాంజనేయులు అందులో నుంచి బయటకు వచ్చేశారు. కొద్దిసేపటికే క్యాబిన్ మొత్తం మంటలు చెలరేగాయి. కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది వచ్చి వాటిని అదుపు చేశారు. విద్యుదాఘాతం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.



ఎగసిపడుతున్న మంటలు

డ్రైవర్ పేరిట ఫైనాన్స్ సంస్థ ఏర్పాటు

- ★ దారి మళ్లించిన సొమ్ము అందులోకి బదిలీ
- ★ దర్యాప్తులో వెలుగుచూస్తున్న నాటి ఐసీఐసీఐ మేనేజర్ నరేష్ అక్రమాలు
- ★ ఆర్థిక లావాదేవీలపై దృష్టి సారించిన గుంటూరు సీఐడీ

పటమట, న్యూస్‌టుడే: ఐసీఐసీఐ బ్యాంకులో మేనేజర్ నరేష్ చేసిన కుంభకోణానికి సంబంధించి దర్యాప్తులో అనేక కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. దీనిపై విచారణ చేస్తున్న గుంటూరు సీఐడీ అధికారులు అన్ని కోణాలను పరిశీలిస్తున్నారు. ఖాతాదారుల ఎఫ్‌డీలు, ఖాతాల్లోని నగదును సొంత అవసరాలకు దారి మళ్లించిన మేనేజర్ అక్రమాలపై సునిశిత దృష్టి సారించారు. పల్నాడు జిల్లా నరసరావుపేట, చిలకలూరిపేట, విజయవాడలోని భారతీనగర్ బ్యాంకు శాఖల్లో కుంభకోణం వెలుగుచూసిన సంగతి తెలిసిందే. భారతీనగర్ శాఖలో బాధితులు దాదాపు 15 మంది వరకు ఉన్నట్లు తేలింది. నెల రోజుల నుంచి పరారీలో ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్ నరేష్ చంద్రశేఖర్ ఖాతాదారులు నుంచి కొల్లగొట్టిన డబ్బును నెక్సస్ గ్రోత్ అనే ఫైనాన్స్ సంస్థకు మళ్లించినట్లు సీఐడీ పోలీసులు గుర్తించారు. ఆ సంస్థను నరేష్ తన దగ్గర పని చేసే డ్రైవర్ ప్రభు శేఖర్ పేరు మీద ప్రారంభించినట్లు పోలీసుల విచారణలో తేలింది. నెక్సస్ గ్రోత్ అనే సంస్థ కార్యాలయంలో కూడా విజయవాడ ఐసీఐసీఐ బ్యాంకు ఉన్న భవనంలో ఉండటం గమనార్హం. శుక్రవారం ఈ సంస్థ వద్దకు సీఐడీ పోలీసులు వచ్చారు. ఆ సమయంలో మూసి ఉంది. కుంభకోణం బయట పడినప్పటి నుంచి మూసివేసినట్లు తెలిసింది. దీంతో కార్యాలయం గోడపై విచారణకు రావాలని సీఐడీ పోలీసులు నోటీసులు అందించారు. ప్రభు శేఖర్ సైతం పరారీ ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రభు శేఖర్ దుబాయ్ పరారీ అయ్యేందుకు గత నెలలో ఓ ముస్లిం మహిళను వివాహం చేసుకున్నట్లు సమాచారం.

కుటుంబ సభ్యుల ఫిర్యాదుపై మిస్సింగ్ కేసు: మేనేజర్ కుటుంబ సభ్యులు నరేష్ కనడపడటం లేదని విజయవాడ పటమట పోలీసులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై పటమట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గత నెల 26న నరేష్ హైదరాబాద్‌లో తనకు డబ్బులు రావాల్సి ఉందని వాటి కోసం వెళ్తున్నట్లు భార్య సరోజినికి తెలిపాడు. తండ్రి సురేష్‌కు వైద్యం చేయించేందుకు తనతో పాటు హైదరాబాద్‌కు తీసుకు వెళ్లాడనీ, వైద్యం చేయించుకున్న అనంతరం బాలానగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లారని పేర్కొన్నారు. 28న నరేష్ తన భార్య సరోజినికి వీడియో కాల్ చేసి హైదరాబాద్‌కు వచ్చిన పనులు అవట్లేదని బాధపడ్డాడు. ఆ రోజు నుంచి ఫోన్ స్విచాఫ్‌లో ఉన్నట్లు బంధువులకు కూడా నరేష్ ఆచూకీ తెలియదంటూ అతని భార్య ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ద్విచక్ర వాహనం తొక్కడంతో మృతి చెందిన సీతాకోక చిలుక



చనిపోయిన దాన్ని తాకి చూస్తున్న గొల్లభామ



క్షణాల్లోనే సీతాకోక చిలుకలు చుట్టూ చేరాయి ఇలా..

మరువలేని నేస్తమా.. మరలిరాని ప్రాణమా

ఒక మనిషికి రహదారిపై ఏదయినా ప్రమాదం జరిగి కష్టంలో ఉంటే చూసి సాయం చేద్దాం అనే ఆలోచన కూడా రానంత బిజీగా మానవ జీవితాలు మారిపోయాయి. మనకేందుకులే అని కనీసం తొంగి చూడడానికి కూడా సమయం కేటాయించని రోజులు ఇవి.. ఒక కాకి మృతి చెందితే పదుల సంఖ్యలో కాకులు అక్కడకు చేరతాయి అంటారు. కానీ ఈ చిత్రాలు చూస్తే సీతాకోక చిలుకలకు మనస్సు, మానవత్వం ఉంది అనిపిస్తుంది కదూ.. కొండపల్లి అటవీ ప్రాంతంలో ఒక సీతాకోక చిలుకను ద్విచక్ర వాహనం తొక్కి వెళ్లిపోవడంతో చనిపోయింది. కొద్ది క్షణాల్లోనే రోడ్డు మీద పడి ఉన్న దాన్ని ఒక గొల్లభామ (గ్రాస్‌హోపర్) వచ్చి చూడగా, తర్వాత వరుసగా ఒక్కొక్క సీతాకోక చిలుక వచ్చి చనిపోయిన దాన్ని తడుముతూ చుట్టూ గుంపుగా చేరాయి. ఏడెనిమిది సీతాకోక చిలుకలు వచ్చి సంచరిస్తూ ఇలా కనిపించాయి. - ఈనాడు, అమరావతి

గనుల శాఖ డీడీగా శ్రీనివాసకుమార్

ఈనాడు, అమరావతి: దాదాపు నాలుగు నెలల తర్వాత జిల్లా గనులు, భూగర్భ గనుల శాఖ అధికారిని ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ జిల్లా అధికారిగా డిప్యూటీ డైరెక్టర్ హోదాలో శ్రీనివాసకుమార్‌ను ప్రభుత్వం నియమించింది. గతంలో కృష్ణా జిల్లాలో ఏడీగా పనిచేశారు. నెల్లూరు జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. అంతకు ముందు డీడీగా ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరరావు మేలో పదవీ విరమణ చేశారు. తర్వాత ఏడీ వీరాస్వామి ఇన్‌ఛార్జిగా కొంతకాలం కొనసాగారు. ప్రస్తుతం ఉచిత ఇసుక కీలకంగా మారడంతో నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై డీడీని నియమించింది. ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల గడువు పొడిగింపు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత శిక్షణ దరఖాస్తుల గడువును ఈనెల 27వ తేదీ వరకు పొడిగించినట్టు ఇన్‌ఛార్జి కలెక్టర్ నిధి మీనా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతుందని చెప్పారు. అభ్యర్థులు http:///jnanabhumi.ap.gov.in (జ్ఞానభూమి) ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

'వైకాపా పాలనలో ముదిరాజ్‌లకు తీవ్ర అన్యాయం'

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : గత వైకాపా పాలనలో ముదిరాజ్ కులస్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్ విమర్శించారు. శుక్రవారం ఆయన ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సంఘీయుల సమస్యలపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌ను కలిసినా పట్టించుకోలేదని దుయ్యబట్టారు. పేరుకే 56 బీసీ కార్పొరేషన్లు అని, ఒక్క రూపాయి ఇవ్వలేదని విమర్శించారు. బీసీలంటే బ్యాక్ బోన్ అని గొప్పలు చెబుతూ.. అన్ని విధాలా వంచించారని పేర్కొన్నారు. కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. గత ఎన్నికల్లో తెదేపా గెలుపునకు ఎంతో కృషి చేశామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15లక్షల మంది కులస్థులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.దుర్గారావు, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు జలకం రాజారావు, వి.వీరబాబు, పి.వెంకటరామయ్య, జంధ్యాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణమోహన్. పక్కన దుర్గారావు, శ్రీనివాసరావు, రాజారావు, శ్రీనివాస్

బ్యాడ్మింటన్ టోర్నీ టీమ్ ఛాంప్ ఏపీ

విజయవాడ క్రీడలు: ఇండియన్ ఆడిట్, అకౌంట్స్ విభాగం రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన దక్షిణ భారత అంతర్ మండలాల బ్యాడ్మింటన్ టోర్నీలో టీమ్ ఛాంపియన్‌షిప్‌ను ఆంధ్రప్రదేశ్ కార్యాలయం సొంతం చేసుకుంది. శుక్రవారం స్థానిక డీఆర్ఆర్ఎంసీ ఇండోర్ స్టేడియంలో ఫైనల్స్ జరిగాయి. పురుషుల సింగిల్స్‌లో శ్రీచరణ్ కోయ (ఏపీ), యష్ యోగి (కర్ణాటక), మహిళల సింగిల్స్‌లో సారా నక్వి (కర్ణాటక), టి.దీప్తి (తెలంగాణ) ప్రథమ, ద్వితీయ స్థానాలు సొంతం చేసుకున్నారు. పురుషుల డబుల్స్‌లో డి.సంజయ్ శ్రీవత్స-సిద్ధార్థ ఎలంగో (తమిళనాడు) జోడీ ప్రథమ, ఎడ్విన్ జోయ్-రాహుల్ ఆజాద్ తల్లూరి (కేరళ, ఏపీ) జోడీ ద్వితీయ, మహిళల డబుల్స్‌లో అరుల్ బాల-సారా నక్వి (కర్ణాటక) జోడీ ప్రథమ, ఎన్.సుశ్వేత-వి.శీతల్ మోహన్‌దాస్ (ఏపీ, తెలంగాణ) జోడీ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. మిక్స్‌డ్ డబుల్స్‌లో డి.సంజయ్ శ్రీవత్స-అరుల్ బాల (తమిళనాడు, కర్ణాటక) జోడీ ప్రథమ, ఎం.అర్జున్‌కుమార్‌రెడ్డి - ఎన్.సుశ్వేత (తెలంగాణ, ఏపీ) జోడీ ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. వెటరన్స్ 35, 40, 45, 50 విభాగాలు స్త్రీ, పురుషుల సింగిల్స్‌తో పాటు 55 పురుషుల సింగిల్స్‌లో నిర్వహించిన పోటీలో విజేతలను ప్రకటించారు. ద్రోణాచార్య అవార్డీ గంగూలీ ప్రసాద్ విజేతలకు ట్రోఫీలు బహూకరించారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చంద్రమౌళి సింగ్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ కిషోర్‌రెడ్డి, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నిఖిల పాల్గొన్నారు.



ఛాంపియన్‌షిప్ జట్టుతో అతిథులు గంగూలీ ప్రసాద్, చంద్రమౌళి సింగ్, కిషోర్‌రెడ్డి, కె.భాస్కర్, తదితరులు

యువతి ఫొటోతో పోర్న్ ఖాతా

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : బీటెక్ చదువుతున్న ఓ విద్యార్థిని ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టి పోర్న్ సైట్‌లో ఖాతా సృష్టించి వేధిస్తున్న సైబర్ నేరగాళ్లపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. విజయవాడ శివారు ప్రాంతానికి చెందిన ఓ యువతి (18) బీటెక్ చదువుతున్నారు. మూడు నెలలుగా గుర్తు తెలియని వ్యక్తి.. ఆమె పేరుతో నకిలీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిచి, పురుషులతో ఛాటింగ్ చేస్తున్నట్లు ఆమె గుర్తించారు. అక్కడితో ఆగకుండా.. పోర్న్ సైట్‌లోనూ ఆమె ఫొటోను ప్రొఫైల్‌గా పెట్టి ఖాతా తెరిచాడు. ఈ వివరాలన్నీ బహిర్గతం కావడంతో ఆమె తీవ్రమైన మనోవేదనకు, మానసిక ఒత్తిడికి గురయ్యారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంబయి పోయి... బెంగళూరు వచ్చె..

డిజిటల్ అరెస్టు పేరుతో రూ.43 లక్షల వసూళ్లు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : మీ పేరుతో ఉన్న పార్శిల్‌లో మాదకద్రవ్యాలున్నాయి. నకిలీ పాస్‌పోర్టులు, పెద్ద స్కామ్‌లో మీ పాత్ర బయటపడిందంటూ ముంబయి పోలీసుల పేరుతో టోకరా వేసే సైబర్ నేరగాళ్లు.. పంథా మార్చారు. ముంబయికి బదులు బెంగళూరు పోలీసులమని భయపెట్టి డబ్బులు గుంజుతున్నారు. తాజాగా విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన ఓ విశ్రాంత అధికారి (72)ని భయపెట్టారు. ఒక భారీ స్కామ్‌లో ఇరుక్కున్నారంటూ బెదిరించి రూ.43 లక్షలు గుంజేశారు. ఆయనకు ఈ నెల 19న గుర్తుతెలియని వాట్సాప్ నంబరు నుంచి ఫోన్ వచ్చింది. తాను బెంగళూరు పోలీసునని పరిచయం చేసుకున్నాడు. ఒక స్కామ్‌లో మీ పేరు ఉందని, దీని నుంచి మిమ్మల్ని తప్పించాలంటే రూ.43లక్షలు చెల్లించాలన్నాడు. భయపడిపోయిన ఆయన.. అడిగిన మొత్తాన్ని రెండు ఖాతాలకు పంపించారు. అవి దిల్లీ, సూరత్‌ల్లోని బంధన్ బ్యాంకు శాఖలుగా పోలీసులు గుర్తించారు. దీనిపై బాధితుడు. . సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.5.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లు ధ్వంసం

ఈనాడు డిజిటల్, అమరావతి : నిబంధనలకు విరుద్ధంగా రవాణా చేస్తూ వివిధ కేసుల్లో పట్టుబడిన రూ.5.5 కోట్ల విలువైన విదేశీ సిగరెట్లను ఏపీ కస్టమ్స్ అధికారులు శుక్రవారం కాల్చి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఏపీ కస్టమ్స్ కమిషనర్ నరసింహారెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. కాకినాడ, విజయవాడ, నెల్లూరు, తిరుపతి నగరాల్లో పట్టుకున్న విదేశీ సిగరెట్లను స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా కాల్చివేసినట్లు తెలిపారు. గుంటూరులోని జిందాల్ ప్లాంట్‌లో 73.71 లక్షల సిగరెట్లు, విశాఖ జిందాల్ ప్లాంట్‌లో 9లక్షల సిగరెట్ స్టిక్‌లను ప్రభుత్వ అనుమతులతో, పర్యావరణానికి హాని కలుగకుండా ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఇటువంటి నాసిరకం సిగరెట్లను ఎవరైనా విక్రయించినా.. సరఫరా చేసినా భారీ జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్ఐ సాహస సూర్య, కస్టమ్స్ ఏపీ అబ్దుల్ అజీమ్, సూపరింటెండెంట్లు కిషోర్, వివేక్, వేణుగోపాల్, ఎన్.శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.



సరకును ధ్వంసం చేస్తున్న కస్టమ్స్ అధికారులు